

'చంపేస్తాం, నరికేస్తాం, అంతుచూస్తాం'భాషతో రాజకీయాలు చేయడం వైసీపీకి అలవాటుగా మారింది. అధికారం కోసం ఎంతటి దారుణానికైనా ఒడిగట్టేలా వారి తీరు ఉంది. రాజకీయ పార్టీలు ప్రజలకు మేలు చేస్తామని చెప్పాలి. మేము వస్తే ఉన్నవి పడగొడతాం, పనులు ఆపేస్తాం, యువతను చెడగొడతాం అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 15.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 358 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# మహిళా రిజర్వేషన్ల కలను సాకారం చేశాం

## నారీ శక్తి వందన్ అధినియంతో కొత్త యుగం ప్రారంభం

## 'మహిళల నేతృత్వంలోని అభివృద్ధి' దిశగా భారత్

## భారత నారీ శక్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ లేఖ



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని, చట్టసభల్లో వారు బలంగా గళమెత్తే సమయం వచ్చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మహిళలకు 33 శాతం సీట్ల కేటాయింపు విషయంలో జరుగుతున్న ఆలస్యం వారికి చేసే అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు దేశంలోని మహిళలను ఉద్దేశించి ప్రధాని ఒక బహిరంగ లేఖ రాశారు.

మహిళా సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపిన ప్రధాని, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో కీలక అడుగు వేయబోతున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 16 నుంచి మూడు రోజుల పాటు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ద్వారా రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యాన్ని పటిష్టం చేస్తామని హామీ ఇచ్చారు.

రిజర్వేషన్ల అమలులో జాప్యం జరిగితే అది మహిళా లోకానికి తీరని నష్టం కలిగిస్తుందని మోదీ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం రాజకీయ అంశం కాదని, అది దేశ అభివృద్ధికి అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక బిల్లుకు అందరూ మద్దతు పలకాలని ఆయన పిలుపునిచ్చారు.

**మహిళా రిజర్వేషన్లపై ఆలస్యం వద్దు - ప్రధాని నరేంద్ర మోదీ:** దేశ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని, చట్టసభల్లో వారు బలంగా గళమెత్తే సమయం వచ్చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మహిళలకు 33 శాతం సీట్ల కేటాయింపు విషయంలో జరుగుతున్న ఆలస్యం వారికి చేసే అన్యాయమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు దేశంలోని మహిళలను ఉద్దేశించి ప్రధాని ఒక బహిరంగ లేఖ రాశారు. మహిళా సాధికారతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపిన ప్రధాని, రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో కీలక అడుగు వేయబోతున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 16 నుంచి మూడు రోజుల పాటు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో 'నారీ శక్తి వందనం అధినియమ్' మిగతా 2లో...

# క్వాంటం టెక్నాలజీకి అమరావతి లాంచ్ ప్యాడ్

- దేశంలో తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఆవిష్కరణ
- 45 లక్షల మందికి క్వాంటం, ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ
- క్వాంటం మౌలిక సదుపాయాలతో రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణం
- ఔషధాల నుంచి క్రయోజెనిక్స్ వరకూ పరిశోధనలకు కేంద్రంగా క్వాంటం వ్యాలీ





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్‌లో ఓ సరికొత్త టెక్ అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ఆవిష్కృతమైంది. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, గన్నవరంలోని మేధా టవర్స్ వద్ద ఏర్పాటు చేసిన 1 ఎస్, 1 క్యూ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. క్వాంటం టెక్నాలజీకి అమరావతిని లాంచ్ పాడ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలను ప్రారంభించిన అనంతరం క్వాంటం రంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.."ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత మొట్టమొదటి క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీని ప్రారంభించటం సంతోషంగా ఉంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1ఎస్ ఓపెన్ యాక్సెస్ క్వాంటం ఫెసిలీటీ, మేధాటవర్స్‌లో 1 క్యూ పేరిట మరో క్వాంటం సిస్టం ఏర్పాటు చేశారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియ చేస్తున్నాను. మిగతా 2లో...

'ఉద్దానం'లో తొలిసారిగా

# బయోమార్కర్స్ పరీక్షలు

- రానున్న నాలుగేళ్లలోపు నమూనాలు ఇచ్చిన వారికి కిడ్నీల వ్యాధుల రాకపై అవగానకు వచ్చే వీలు
- ప్రత్యేక బృందం ద్వారా స్థానికుల నుంచి రక్త, మూత్ర నమూనాల సేకరణ
- కిడ్నీ వ్యాధుల రాకకు మూలాలు కనుగొనేందుకు మొదలైన పరిశోధన
- విశాఖ కేజీహెచ్ లో ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు
- మంత్రి సత్యకుమార్ యాదవ్ కు పురోగతిని నివేదించిన పరిశోధన బృందం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ ప్రక్రియ మొదలైంది. నిపుణుల నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యింది. విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ఉద్దాన ప్రాంత వాసుల నుంచి వ్యాధుల రాకకు కారణాలపై రక్త నమూనాలను సేకరిస్తున్నారు. కిడ్నీ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించేలా మూత్ర నమూనాల పరీక్షలో 'బయో మార్కర్స్' విధానాన్ని ఈ సారి కొత్తగా అమలు చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ద్వారా స్థానికుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. ఇప్పటివరకు ఉద్దాన ప్రాంతంలో తీసుకున్న చర్యల గురించి పరిశోధన బృందం సభ్యులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ పరిశోధన చురుగ్గా నిర్వహించాలని, ఉద్దాన బాధితుల్లో సాంత్వన చేకూరేలా చర్యలుండాలని సభ్యులకు స్పష్టం చేశారు.

**గత వైకాపా ప్రభుత్వం నిర్వాకంతో పరిశోధనకు ఆటంకం :** గత తెదేపా ప్రభుత్వ (2014-19) హయాంలో ఆస్ట్రేలియాకు చెందిన జార్జ్ ఇన్స్టిట్యూట్‌కు పరిశోధన బాధ్యతల్ని అప్పగించింది. వ్యాధుల రాకకు కారణాలపై ప్రారంభమైన పరిశోధన గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంవల్ల కొనసాగలేదు. మిగతా 2లో...

# పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



- ఎన్టీఆర్, చంద్రబాబుల ఆశయ సాధనే మన మార్గం
- పార్టీ కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి టీడీపీ బలోపేతానికి కృషి చేయండి
- "కాఫీ కబుర్లు" కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్చార్జిలకు మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్) :** పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని, పార్టీ సిద్ధాంతాలే నాయకత్వానికి బలం అని విద్య, ఐటి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జుల శిక్షణ తరగతుల్లో భాగంగా "కాఫీ కబుర్లు" కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలుగుజాతి విశ్వఖ్యాతి అంటే గుర్తుకు వచ్చేది అన్న ఎన్టీఆర్. తెలుగు జాతి శక్తి ఏంటో ప్రపంచానికి చూపించిన వ్యక్తి చంద్రబాబు. వీరిద్దరూ బలమైన సిద్ధాంతాలతోనే విజయం సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని నేతలకు మంత్రి సూచించారు.

**సిద్ధాంతాలే నాయకత్వానికి బలం :** "ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న పార్టీ సిద్ధాంతాలను కూడా ప్రజలకు వివరించడం అత్యంత కీలకం. కార్యకర్తల మధ్య ఐక్యత, క్రమశిక్షణ ఉంటేనే పార్టీ మరింత బలపడుతుంది. సిద్ధాంతాలపై ఆధారపడి ప్రజల్లో విశ్వాసం పెంచుకుంటేనే దీర్ఘకాలిక రాజకీయ విజయాలు సాధ్యమవుతాయి. సిద్ధాంతపరంగా ఎదిగిన నాయకత్వమే పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది" అని మంత్రి తెలిపారు.

**ఆరు ముఖ్య సిద్ధాంతాలు గ్రామస్థాయికి తీసుకెళ్లాలి :** "ఎన్ని పనులున్నా సీఎం గారు, నేను ప్రతి వారం ఏదో ఒక ఒక రోజు పార్టీ కార్యాలయంలో గడుపుతూ ప్రజా సమస్యలను వింటూ పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. మిగతా 2లో...

# చంద్రబాబు విజన్ తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు



- రూ. 2.75 కోట్లతో ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు,లైబ్రరీల ఆధునీకరణ
- రాష్ట్రంలో 36 కేంద్రాలకు 216 కంప్యూటర్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన
- మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి
- శిక్షణ కేంద్రాల్లో కొత్త కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్ వేర్ ఏర్పాటు
- ఏఐ, సైబర్ నెట్ వర్క్, క్లౌడ్ కంప్యూటింగ్ లాంటి డిమాండ్ కోర్సులకు శిక్షణ

2 లో

# జువ్వలదిన్నెలో మొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డు



**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నెల్లూరు జిల్లాలోని జువ్వలదిన్నె దేశంలోనే మొట్టమొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డుగా అవతరించబోతోందని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్లోబల్ మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కేవలం మౌలిక సదుపాయాల కల్పనే కాకుండా, అత్యాధునిక సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. మిగతా 2లో...

# విశాఖ నుంచి భోగాపురం వరకు మెట్రో..!

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :** రుషికొండ ఐటీ సెజ్‌కు మెట్రో సేవలు అందించాలని.. భోగాపురం వరకూ పొడిగించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. విశాఖ వచ్చిన మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డి సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని మెట్రో గురించి చర్చించారు. కొమ్మాది వరకు ప్రతిపాదించిన మెట్రో ను భోగాపురం వరకు పొడిగిస్తే ఎయిర్‌పోర్టు యూజర్స్‌కు ఉపయోగపడడంతో పాటు ఆ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని గంటా అభిప్రాయపడ్డారు. రోడ్డు సౌకర్యం సహా మెట్రో కూడా అందుబాటులో ఉంటే విశాఖ నుంచి భోగాపురం మిగతా 2లో...





# 'నారీ శక్తి వందన్'కు మద్దతివ్వండి..

- పార్టీల అధ్యక్షులు, ఎంపీలకు సీఎం చంద్రబాబు లేఖ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళా రిజర్వేషన్ 'నారీ శక్తి వందన్' చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు కోరుతూ రాజకీయ పార్టీల అధ్యక్షులకు, రాష్ట్రంలోని రాజ్యసభ, లోక్‌సభ ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. 2029 ఎన్నికల నుంచే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తీసుకువస్తున్న 'నారీ శక్తి వందన్' బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు పలకాలని లేఖలో కోరారు. జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి, మిగతా 2లో...

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

- త్వరలో కూటమి నాయకులతో భారీ సమీక్ష..
- పుష్కర ఏర్పాట్లపై మంత్రి దుర్గేష్ వెల్లడి
- నిడదవోలు అభివృద్ధిపై పవన్ కళ్యాణ్ ఆరా
- పుష్కరాల భద్రతపై కీలక ఆదేశాలు
- ఘాట్ల ఆధునీకరణకు శ్రీకారం..
- టెక్నాలజీతో భక్తుల రద్దీ నియంత్రణ

2 లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించినట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, ప్రధానంగా నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి వివరాలపై సమీక్షించారన్నారు..అదే విధంగా గోదావరి పుష్కరాల నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో వైభవంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించినట్లు మంత్రి దుర్గేష్ చెప్పారు.



# మహిళా రిజర్వేషన్ల కలను సాకారం చేశాం

(మొదటి పేజీ తరువాయి)

సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించడం ద్వారా రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యాన్ని పటిష్టం చేస్తామని హామీ ఇచ్చారు.
రిజర్వేషన్ల అమలులో జాప్యం జరిగితే అది మహిళా లోకానికి తీరని నష్టం కలిగిస్తుందని మోదీ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం పెరగడం అనేది కేవలం రాజకీయ అంశం కాదని, అది దేశ అభివృద్ధికి అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక బిల్లుకు అందరూ మద్దతు పలకాలని ఆయన పిలుపునిచ్చారు.

## ‘నారీ శక్తి వందన్’కు మద్దతివ్వండి..

(మొదటి పేజీ తరువాయి)

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస రావు తదితర నాయకులకు ముఖ్యమంత్రి లేఖలు పంపారు.
మహిళలకు పార్లమెంట్, విధాన సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని బలపరుద్దామని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ఈ నెల 16వ తేదీ భారత ప్రజాస్వామ్యంలో చారిత్రక ఘట్టమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ‘నారీ శక్తి వందన్ అధినియం’ మహిళా సాధికారతతో పాటు దేశ ఉన్నతికి దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వంలో, పరిపాలనలో, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని నమ్ముతున్నట్లు వ్యాఖ్యానించారు. భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తికి వందనం పలుకుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులు, మంచినీరు, పారిశుద్ధ్యం మరియు విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు.
పుష్కర ఏర్పాట్లపై త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈ భేటీలో క్షేత్రస్థాయి సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకోనున్నామన్నారు. రాష్ట్ర గౌరవం ఇనుమడించేలా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ గోదావరి పుష్కరాలను నిర్వహించబోతోందని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
అదేవిధంగా నిడదవోలు నియోజకవర్గంలో గ్రామీణ అభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా పలు పనులు చేపట్టినట్లు, వాటి పురోగతిని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు వివరించినట్లు మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ క్రమంలో నిడదవోలు అభివృద్ధికి సహకరిస్తున్నందుకు డిప్యూటీ సీఎం కి మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు.

# తిప్పాని అరుణశ్రీకి జీవీఆర్ హిందీ సేవాపురస్కార్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో గత 25 సంవత్సరాలుగా హిందీ భాషనందు సేవలందిస్తున్న తిప్పాని అరుణశ్రీకి ‘జీవీఆర్ హిందీ సేవాపురస్కార్’ అందజేశారు. మంగళగిరి ప్రాంతంలో నాలుగు దశాబ్దాల పాటు హిందీ భాషకు జీవీఆర్ ఆచార్యులు విశేషంగా సేవలందించారు. వీరి వద్ద శిష్యరికం చేసిన అనేక మంది మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో హిందీ ఉపాధ్యాయులుగా జీవితంలో స్థిరపడ్డారు. అంతగా హిందీ భాషకు సేవలందించిన జీవీఆర్ ఆచార్యులు పేరిట ‘జీవీఆర్ హిందీ పరిషత్’ను నెలకొల్పి ప్రతియేటా వీరి జయంతి సందర్భంగా ‘జీవీఆర్ హిందీ సేవాపురస్కార్’ అందజేస్తున్నారు. ఈ మేరకు జీవీఆర్ హిందీ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సీకే జూనియర్ కళాశాల ఆవరణలో జీవీఆర్ ఆచార్యులు 79వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆప్కో మాజీ చైర్మన్, సీకే జూనియర్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గంజి చిరంజీవి, జీవీఆర్ ఆచార్యులు, రఘునాథాచార్య వేదిక్ ట్రస్ట్ సెక్రటరీ మల్లవరపు మల్లికార్జునశర్మ, విశిష్ట అతిథులుగా మంగళగిరి, తాడేపల్లి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాజ లక్ష్మీప్రసాద్, రవీంద్రభారతి స్కూల్ ప్రిన్సిపాల్ వేమూరి డానియేలు, అతిథులుగా జీవీఆర్ హిందీ పరిషత్ గౌరవాధ్యక్షులు జీఎస్ఆర్ వరదాచార్యులు (నాని), జీవీఆర్, రఘునాథాచార్య వేదిక్ ట్రస్ట్ కోశాధికారి ఆరవల్లి లక్ష్మీసామ్రాజ్యం హాజరయ్యారు.
ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో వేలాది మందికి హిందీభాషను సులభరీతిలో అర్థమయ్యేలా బోధించడంలో జీవీఆర్ ఆచార్యులు (హిందీ మాస్టర్, ఆచార్య మాస్టర్) పేరొందారని, వారి ప్రోత్సాహంతో ఎందరో హిందీ టీచర్లుగా స్థిరపడ్డారని శ్లాఘించారు. హిందీ భాషనందు విశేష సేవలందిస్తున్న వారిని గుర్తించి జీవీఆర్ ఆచార్యులు జయంతి సందర్భంగా పురస్కారాలు అందజేస్తుండడంపై నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా ‘జీవీఆర్ హిందీ సేవాపురస్కార్’ ను తిప్పాని అరుణశ్రీకి అతిథులు అందజేసి సముచిత రీతిన సత్కరించారు. అలాగే, హిందీ భాషలో విశేష ప్రతిభ చూపిన మంగళగిరి–తాడేపల్లి మండలంలోని ప్రైవేటు విద్యాసంస్థల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థినీవిద్యార్థులను సన్మానించడంతోపాటు ప్రైవేటు విద్యాసంస్థలయందు విద్యాబోధన చేస్తున్న హిందీ ఉపాధ్యాయినీఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని జీవీఆర్ హిందీ పరిషత్ అధ్యక్షులు నిమ్మగడ్డ రాజేశ్వరి, కార్యదర్శి కోల వాసుదేవనయనార్, కోశాధికారి పూట్ల లీలావతి, హిందీ స్కూల్ అసిస్టెంట్ పులి భాస్కర్ నిర్వహించారు.

# క్వాంటం టెక్నాలజీకి అమరావతి లాంచ్ పాడ్

(మొదటి పేజీ తరువాయి)

క్వాంటం సైన్స్ వంద ఏళ్లు పూర్తైన సందర్భంగా ప్రపంచ క్వాంటం దినోత్సవం రోజున దీన్ని సాకారం చేసుకుని చరిత్ర సృష్టించాం. విజ్ఞానమే సామాజిక ప్రగతికి చిహ్నం అని చెప్పిన అంబేద్కర్ గారి జయంతిని పురస్కరించుకుని అమరావతిలో క్వాంటం కంప్యూటర్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించుకున్నాం. క్వాంటం టెక్నాలజీని పరిశోధకులకు, కంపెనీలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచేలా ఈ టెస్ట్ బెడ్‌లను ఏర్పాటు చేయటంపై అందరికీ అభినందనలు. భారత తొలి ఓపెన్–యాక్సెస్ క్వాంటం ఫెసిలిటీలతో పాటు అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు ప్రోత్సహిస్తోన్న ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఏక్యూవీ ని వేగంగా పూర్తి చేయటంలో సహకరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్‌కు ధన్యవాదాలు. అమరావతిలో ప్రారంభమైన 1ఎస్ ,1 క్యూ క్వాంటం హార్డ్‌వేర్ టెస్ట్‌బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టిఫై చేయడానికి కీలకం. దేశంలోని తొలి క్వాంటం కంప్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ వేదిక అయినందుకు గర్విస్తున్నాను. ఐటీ రంగంలో కీలక పాత్ర పోషించిన తెలుగు గడ్డ ఇప్పుడు క్వాంటం టెక్నాలజీకి వేదికగా మారటం సంతోషదాయకం” అని ముఖ్యమంత్రి అన్నారు.

**క్వాంటం రంగంలో ఆత్మనిర్భర్‌గా ఆంధ్రప్రదేశ్ :** “పారిశ్రామిక రంగానికి విద్యుత్ కీలకం, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ అంతే ముఖ్యం, ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ ప్రధానం. క్వాంటం సాంకేతికతలో సాధికారిత సాధించిన దేశాలే భవిష్యత్తును శాసించే అవకాశం ఉంటుంది. భారతీయ పరిశోధకులకు క్వాంటం హార్డ్‌వేర్ పరీక్షించేందుకు అమరావతి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ ప్రధాన కేంద్రం అవుతుంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని అమరావతి 1 ఎస్ కంప్యూటర్ పరిశోధనలకు, మేధా టవర్స్‌లోని అమరావతి 1క్యూ




కంప్యూటర్ పారిశ్రామిక వినియోగానికి తోడ్పడతాయి. అమరావతిలో ఏర్పాటైన ఈ రెండూ టెస్ట్ ఫెసిలిటీలు క్వాంటం టెక్నాలజీలో దేశ సామర్థ్యాన్ని పెంచాయి. కేవలం 8 నెలల్లోనే క్వాంటం కంప్యూటింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్వాంటం కంప్యూటర్లను నిర్మించాలని నేను ఇచ్చిన సూచనల మేరకు ఇవి ఏర్పాటయ్యాయి. దేశానికి, ప్రపంచానికి కావాల్సిన క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు కూడా ఇక్కడే తయారు చేసేలా కార్యాచరణ చేపట్టాం. ముంబైలోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, పూణెలోని డీఆర్డీఓ సహా వివిధ సంస్థల భాగస్వామ్యంతో స్వదేశీ టెక్నాలజీతోనే ఈ క్వాంటం టెస్ట్ బెడ్‌లు సిద్ధమయ్యాయి. ఇక వ్యూహాత్మక టెక్నాలజీల్లో భారత్ ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదని భావిస్తున్నాను. దేశీయంగానే క్వాంటం ఉపకరణాలు తయారు చేయటం ఆత్మనిర్భర్ కార్యక్రమంలో కీలకమైన అంశం. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో రూపొందించుకున్న 10 సూత్రాల్లో డీప్ టెక్ కూడా ఓ కీలకమైన అంశం” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

**డిసెంబరు నుంచి అమరావతి క్వాంటం వ్యాలీ:** “కృష్ణానదీ తీరంలో ప్రజా రాజధాని అమరావతిని బ్లూ–గ్రీన్ సిటీగా కాలుష్యరహితంగా నెట్ జీరో కాన్సెప్టుతో నిర్మిస్తున్నాం. అమరావతిని శాశ్వత రాజధానిగా పార్లమెంటు చట్టబద్ధత కల్పించింది. తిరుపతిలో స్పేస్ సిటీ, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, గ్రీన్ హైడ్రోజన్, విశాఖలో మెడ్ టెక్, అనంతపురంలో సెమీ కండక్టర్ ఉత్పత్తి కేంద్రాలు అభివృద్ధి చేస్తున్నాం. డేటా సెంటర్ సహా, ఏఐ మౌలిక సదుపాయాలను కూడా త్వరలోనే ప్రారంభించబోతున్నాం. 15 బిలియన్ యూఎస్ డాలర్లతో గూగుల్ అతిపెద్ద పెట్టుబడిని ఏపీలో పెడుతోంది. ప్రతీ పౌరుడికీ ఏఐ లాంటి సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నదే మా లక్ష్యం. డిసెంబరు నుంచి అమరావతిలో క్వాంటం వ్యాలీ కూడా ప్రారంభం అవుతుంది. వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్‌తో పాటు ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్ ను తీసుకురావాలని ఆలోచన చేస్తున్నాం. ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ ఎకోసిస్టమ్ ను ప్రోత్సహిస్తున్నాం. ఐఐటీ చెన్నై, ఐబీఎం, వైసర్ సంస్థల భాగస్వామ్యంతో 45 లక్షల మందిని ఏఐ, క్వాంటం, డేటా సెక్యూరిటీలో నిపుణులుగా తీర్చిదిద్దుతాం. సాంకేతికతను అనుసరించటం కాదు...ఆవిష్కరణల స్థాయికి ఏపి ఎదిగేలా చర్యలు చేపడుతున్నాం. కొత్త సంస్థలు, నైపుణ్యం, క్వాంటం మౌలిక సదుపాయాలతో రాష్ట్ర భవిష్యత్తును నిర్మిస్తున్నాం. ఔషధాల ఆవిష్కరణ, వ్యవసాయ ఉత్పాదకత, రక్షణ పరిశోధన, లాజిస్టిక్స్, క్రయోజనిక్స్, ఫ్యాబ్రికేషన్, యాంప్లిఫైడ్ రీసెర్చ్ లాంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు వస్తాయి. డిజిటల్ లావాదేవీలు మరింత సురక్షితంగా మారే అవకాశం ఉంది. క్లైమేట్ మోడలింగ్ లాంటి అంశాలను చేపట్టవచ్చని” ముఖ్యమంత్రి వెల్లడించారు.

**తొలి క్వాంటం టెస్ట్ ఫెసిలిటీ కలిగిన రాష్ట్రంగా ఏపీ :** అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా నిర్మితమైన తొలి క్వాంటం టెస్ట్ బెడ్స్ తో ఆంధ్రప్రదేశ్ ఈ టెస్ట్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా మారింది. ఈ రెండు క్వాంటం టెస్ట్ ఫెసిలిటీల ద్వారా క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాలను పరీక్షించి సర్టిఫై చేసేందుకు అవకాశం ఏర్పడినట్టైంది. తద్వారా క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్థ్యాన్ని అమరావతి క్వాంటం వ్యాలీ అందిపుచ్చుకుంది. మైనస్ 273 డిగ్రీల ఉష్ణోగ్రత మధ్య క్వాంటం హార్డ్ వేర్, సెమీ కండక్టర్లను పరీక్షించేలా ఈ రిఫరెన్స్ ఫెసిలిటీలను ఏర్పాటు చేశారు. క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు, ఉపకరణాలు తయారు చేసే వివిధ సంస్థలు, పరిశోధకులు, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఎస్ఆర్ఎం వర్సిటీలోని 1 ఎస్ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటి ఓపెన్ యాక్సెస్ గా మార్చారు. ఈ కార్యక్రమానికి కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, వర్చువల్ గా ప్రధాని సాంకేతిక సలహాదారు అజయ్ సూద్, డీఆర్డీఓ డీజీ ఆర్వీ ప్రసాద్,క్యూబిట్ ఫోర్స్ ఫౌండర్ వెంకట సుబ్రమణియన్, ఎస్ఆర్ఎం వర్సిటీ ప్రెసిడెంట్ సత్యనారాయణ్, వీసీ ప్రొఫెసర్ సతీష్ కుమార్, ఐఐటీ చెన్నై, తిరుపతి ప్రొఫెసర్లు కామకోటి, సత్యనారాయణ ఏపీ స్టేట్ క్వాంటం మిషన్ డైరెక్టర్ సీవీ శ్రీధర్ తదితరులు హాజరయ్యారు.

# పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ప్రత్యేక సమయం కేటాయించాలి. పార్టీ ప్రవేశపెట్టిన ఆరు ముఖ్య సిద్ధాంతాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పించాలి” అని సూచించారు.

**పార్టీతో కార్యకర్తలను అనుసంధానం చేసేది మై టీడీపీ యాప్ :** “ప్రతి బూత్, క్లస్టర్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం అత్యవసరం. రాజకీయాల్లో కొత్త తరాన్ని ప్రోత్సహిస్తూ, సిద్ధాంతపరంగా శిక్షణ పొందిన నాయకత్వాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. “మై టీడీపీ” యాప్ ద్వారా కార్యకర్తలు తమ కార్యకలాపాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. ప్రతి ఒక్కరి పనితీరును పార్టీ అధినేత పర్యవేక్షిస్తున్నారు. వ్యక్తిగత పనులు పూర్తిచేసుకుని కొంత సమయం కేటాయించి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటిని అధికారుల ద్వారా పరిష్కరించేందుకు కృషి చేయండి. సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించండి. కష్టపడిన వారికి తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుంది” అని హామీ ఇచ్చారు.

**రెడ్ బుక్ సమాజ బాగు కోసం..రాజారెడ్డి**



**రాజ్యాంగంతోఈ విధ్వంసం :** “గతంలో దేవాలయంలాంటి తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై, చంద్రబాబు గారి ఇంటిపై, నాయకులపై వైసీపీ నాయకులు దాడులు చేశారు. కార్యకర్తలను హింసించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలపై దమనకాండకు పాల్పడ్డారు. అమర్నాథ్ గౌడ్, అబ్దుల్ సలాం, తోట చంద్రయ్యలను వెంటాడి మరీ చంపారు. డా.సుధాకర్, కోడెల శివప్రసాద్, మిస్బా అనే చిన్నారిలను వేధించి మరణానికి కారకులయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు విధ్వంసం–దాడులు–హత్యలు–అవినీతితో చెలరేగిపోయిన జగన్..అధికారం పోయాక కూటమి ప్రభుత్వంపై విషప్రచారాలతో విరుచుకుపడుతున్నాడు. ఐకమత్యంగా పోరాట స్ఫూర్తితో వైసీపీ ఫేక్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే ఫేక్ సమాచారాన్ని తిప్పికొట్టండి. నా రెడ్ బుక్ సమాజ బాగు కోసం అయితే, రాజారెడ్డి రాజ్యాంగంతో జగన్ సమాజాన్ని నాశనం చేయాలనుకున్నాడు. ఏ ఆత్మ చెప్పిందో కానీ మావిగన్ అంటూ కలవరిస్తున్నాడు జగన్.

**నేతల మధ్య సఖ్యత ముఖ్యం :** “రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టే అమరావతికి చట్టబద్ధత వచ్చింది, విశాఖ ఉక్కు పరిరక్షణ జరిగింది, రాష్ట్రానికి ప్రత్యేక నిధుల సాధన వంటి విజయాలు సాధ్యమవుతున్నాయి. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కూటమి భాగస్వాములతో కలిసి పనిచేయాలి. కుటుంబంలా ఐక్యంగా ఉంటేనే ప్రభుత్వం స్థిరంగా ఉంటుంది. కుటుంబసభ్యుల మధ్య కలహాలు వస్తే అంతా కలిసి కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకున్నట్టే, కూటమి నేతలు కుటుంబంలా కూర్చొని చర్చించుకుని విభేదాలు విడనాడలి– అని సూచించారు.

# ‘ఉద్దానం’లో తొలిసారిగా బయోమార్కర్స్ పరీక్షలు



(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ పరిశోధనలో కదలిక వచ్చింది.

**మంత్రి చొరవతో ఐసీఎంఆర్ ఆమోదం :** ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్నందున వాటి మూలాలు కనుగొనేందుకు గతేడాది నవంబరులో ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్–డిపార్టుమెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ విభాగం) మూడేళ్ల కాలపరిమితితో ప్రత్యేకంగా రూ. 6.2 కోట్లను గ్రాంటు రూపంలో ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ మేరకు ఐసిఎంఆర్ సానుకూలంగా స్పందించింది. సీనియర్ నెఫ్రాలజిస్ట్ ప్రొఫెసర్ తాతపూడి రవిరాజు మెంటార్‌గా ఆంధ్ర వైద్య కళాశాల నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రసాద్ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్‌గా పరిశోధన ప్రారంభమైంది. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేకంగా ఏర్పడిన బృందం ఉద్దాన ప్రాంత స్థానికులను కలుసుకుంటోంది. ఇప్పటివరకు సుమారు 1,500 మంది నుంచి రక్త, మూత్ర నమూనాలను సేకరించింది. వీటిని పలాసలోని కిడ్నీ రీసెర్చ్ కేంద్రంలో తొలుత భద్రపరిచి, ఆ తర్వాత తగిన జాగ్రత్తలతో కేజీహెచ్ లో ఉన్న ల్యాబ్ కు తరలిస్తున్నారు.

**ల్యాబ్ లో అత్యాధునిక పరికరాలు/యంత్రాలు :** ఐసీఎంఆర్ ఆమోదం తెలిపిన మేరకు విశాఖ కేజీహెచ్ లో సెంట్రిఫ్యూజ్ లు, డీప్ ఫ్రీజర్లు, శాంపిల్ స్టోరేజీ సిస్టమ్స్, అనలిటకల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫీల్డ్ శాంపిలింగ్ కిట్లు ఈ ల్యాబ్ లు ఉన్నాయి. సుమారు రూ. 80 లక్షలతో కొనుగోలుచేసిన అత్యాధునిక పరికరాలు/ యంత్రాలను బయో సేఫ్టీ ప్రమాణాలకు ల్యాబ్ లో ఏర్పాటయ్యాయి.

**కిడ్నీ వ్యాధుల తీవ్రతపై అంచనా :** బయో మార్కర్స్ టెస్టింగ్ ద్వారా కిడ్నీ బాధితులను ప్రాథమిక దశలోనే అతి త్వరగా గుర్తించేందుకు వీలుందని మెంటార్ డాక్టర్ రవిరాజ్, ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ జి. ప్రసాద్ వెల్లడించారు. మూత్ర నమూనాలను ‘బయో మార్కర్ విధానంలో పరీక్షించడంవల్ల రానున్న మూడు, నాలుగు సంవత్సరాల్లో కిడ్నీ వ్యాధుల బారినపడేందుకు అవకాశం ఉన్నట్లయితే సూక్ష్మ స్థాయిలో తెలిసిపోతుందని వివరించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మూకుమ్మడిగా ఇటువంటి పరీక్షలు చేయడం ఇదే తొలిసారి అని చెప్పారు. మూత్ర నమూనాల సేకరణలో బాధితుల కుటుంబ నేపథ్యం, ఇతర అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈ ఈ పరీక్షల ద్వారా రానున్న మూడు, నాలుగేళ్లలో కిడ్నీ సమస్య వచ్చే అవకాశం ఉందా? లేదా? వస్తే ఏ స్థాయిలో వచ్చేందుకు అవకాశాలున్నాయి? అన్న వాటిపై స్పష్టత వస్తుందని వైద్యులు వెల్లడించారు. ఈ ఫలితాల ఆధారంగా రోగులు తగిన జాగ్రత్తలతో వ్యవహరించేందుకు, వైద్యాన్ని అందించేందుకు సులువవుతుందని తెలిపారు. దీనివల్ల వ్యాధి ముదరకుండా... కిడ్నీలు చెడిపోకుండా ఉండేందుకు వీలుంది. ఆర్ఎన్నీ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు. నిర్ణీత కాల వ్యవధిలోనే పరిశోధన పూర్తిచేసేందుకు వీలుగా నిర్దిష్ట ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని వారు మంత్రి సత్యకుమార్ యాదవ్ కు వివరించారు.

# చంద్రబాబు విజన్ తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా 36 కేంద్రాల్లో రూ. 2.75 కోట్లు వ్యయంతో ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో కొత్త కంప్యూటర్లు, ఆధునిక సాఫ్ట్ వేర్ తో పాటు, లైబ్రరీల ఆధునికరణ చేపడుతున్నట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన రూ. 2.75 కోట్లు మొత్తం ప్రభుత్వం మంజూరు చేసి ఉర్దూ అకాడమీకి జమ చేయడం కూడా జరిగిందని మంగళవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లోని 36 కేంద్రాలలో 216 కొత్త కంప్యూటర్లు, కొత్త యూపీఎస్ లు, లేజర్ జెట్ ప్రింటర్లు, స్కానర్లతోపాటు ఆధునిక సాఫ్ట్ వేర్ ఏర్పాటు, లైబ్రరీల ఆధునీకరణ చేపడుతున్నట్లు అయన తెలిపారు. ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి యువతకు కొత్త కోర్సులు నేర్పించబోతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ ), సైబర్ నెట్ వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, జావా, పైతాన్, గ్రాఫిక్ డిజైనింగ్ లాంటి, దేశ విదేశాల్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షకులకు కూడా ప్రత్యేక శిక్షణ ఇప్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారులి

**చంద్రబాబు విజన్ తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ తో మైనారిటీ యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తున్నదని మైనారిటీ మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. మైనారిటీల



సంక్షేమం, ఉర్దూ భాషాభివృద్ధికి సీఎం చంద్రబాబు పక్షపాతిగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. చంద్రబాబు సారథ్యంలోనే ఉర్దూ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, లైబ్రరీల ఆధునీకరణ యువత భవిష్యత్తును అత్యున్నత స్థాయిలో మార్చబోతున్నదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం నవ్యాంధ్రలో 36 కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, (65 మంది బోధన సిబ్బంది,25 మంది ఇతర సిబ్బందితో) మరియు 36 ఉర్దూ లైబ్రరీలను కాపాడుకుంటూ రావడం జరిగిందన్నారు. 2014–2019 లో ఉర్దూ అకాడమీకి ఏకంగా రూ. 160.62 కోట్లు నిధులు ను సీఎం చంద్రబాబు విడుదల చేశారని, ఈ నిధులతో శిక్షణ కేంద్రాలు అత్యాధునిక ల్యాబ్ లుగా మారి వేలాదిమంది నిరుద్యోగ యువతకు సాఫ్ట్ వేర్ రంగంలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ శిక్షణను అందిపుచ్చుకున్న యువత ఎంతోమంది దేశ విదేశాల్లోని ప్రముఖ అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు చేస్తూ ఆర్థిక అభివృద్ధి వైపు అడుగులు వేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2019–2024 లో ఉర్దూ శిక్షణ కేంద్రాలను, లైబ్రరీలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఫరూక్ విమర్శించారు. బడ్జెట్ విడుదల చేయకపోవడంతో గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో శిక్షణ కార్యక్రమాలు నిలిచిపోయి, మౌలిక సదుపాయాలు దెబ్బతిని, మైనారిటీ యువత కలలు కనుమరుగయ్యే దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అత్యధిక బడ్జెట్ కేటాయిస్తూ రావడం జరుగుతున్నదని మంత్రి వెల్లడించారు. ఉర్దూ శిక్షణ కేంద్రాలను పటిష్టం చేయడం, లైబ్రరీలను ఆధునికరించడం కోసం ప్రతి కేంద్రానికి 5 నుండి 6 కొత్త కంప్యూటర్లు, ప్రింటర్లు ఇతర మౌలిక సదుపాయాలు, ఆధునిక సాఫ్ట్ వేర్ ను ఏర్పాటుచేసి సరికొత్త హంగులతో పునః ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీల జీవితాల్లో వెలుగులు నింపే, యువతకు ఎంతో ఉజ్వల భవిష్యత్తు కలిగించే విధంగా శిక్షణ కోసం, లైబ్రరీల ఆధునికరణకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను, ఉర్దూ లైబ్రరీలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాల్సిందిగా ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, డైరెక్టర్ గౌస్ పీర్ లకు మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సూచించారు.

# జువ్వలదిన్నెలో మొదటి అటానమస్ మారిటైం షిప్ యార్డు

(మొదటి పేజీ తరువాయి)

**రూ.288.80 కోట్ల పెట్టుబడి.. యువతకు భారీగా ఉద్యోగాలు :** జువ్వలదిన్నెఫిషింగ్ హార్బర్‌ను ప్రభుత్వం రూ. 288.80 కోట్ల భారీ పెట్టుబడితో సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసిందని మంత్రి అనగాని వెల్లడించారు. ఈ కేంద్రాన్ని ఒక రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దడం వల్ల, సాంకేతిక, పరిశోధన రంగాల్లో ఆసక్తి ఉన్న యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. మారిటైం రోబోటిక్స్ రంగంలో ఏపీకి



ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన వివరించారు.
ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి శూన్యమని మంత్రి విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం ఒక్క హార్బర్‌ను కానీ, పోర్టును కానీ పూర్తి చేయలేకపోయిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న జగన్, జువ్వలదిన్నె ప్రాజెక్టుపై అనవసరంగా విషం కక్కుతున్నారని మంత్రి మండిపడ్డారు. మత్స్యకారుల ప్రయోజనాలను గాలికొదిలేసిన గత ప్రభుత్వం, ఇప్పుడు అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతోందని విమర్శించారు.

# విశాఖ నుంచి భోగాపురం వరకు మెట్రో..!

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లే ప్రయాణికులు రాకపోకలు గణనీయంగా పెరుగుతాయని చెప్పారు. రుషికొండలో కాగ్నిజెంట్, యాక్సెంచర్, టీసీఎస్ వంటి అంతర్జాతీయ ఐటీ సంస్థలు ఏర్పాటు కానుండడంతో మెట్రో లైన్‌ను ఆ ప్రాంతానికి అనుసంధానిస్తే ఐటీ ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. విశాఖలో 4 కారిడార్ల కింద మొత్తం 76.90 కిలో మీటర్ల మెట్రోను ప్రతిపాదించినట్లు రామకృష్ణారెడ్డి వెల్లడించారు. మొదటిదశలో రూ. 11,498 కోట్లతో 46.23 కిలో మీటర్ల లైన్ నిర్మిస్తున్నామన్నారు. సుమారు 100 ఎకరాల భూ సేకరణ కోసం రూ. 882 కోట్లు వెచ్చిస్తున్నామని తెలియజేశారు. నేషనల్ హైవే మీదుగా 10 ఫ్లయ్ ఓవర్లు నిర్మించడం ద్వారా ట్రాఫిక్ కష్టాలు అధిగమించవచ్చని చెప్పారు.

## ఘంటసాల శ్రీనివాస్‌కు ఎన్జీజీవో చెరుకుపల్లి యూనిట్ సన్మానం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ఏపీ ఎన్జీజీవో సంఘం చెరుకుపల్లి తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం నగరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి గుంటూరు జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరుకుపల్లి యూనిట్ కార్యవర్గ సభ్యులు, బాపట్ల జిల్లా కార్యవర్గ సభ్యులు కలిసి ఘంటసాల శ్రీనివాస్‌ను సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

కార్యక్రమంలో గుంటూరు సిటీ అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు. ఆయనకు కూడా కార్యవర్గ సభ్యులు సన్మానం నిర్వహించారు. సమావేశంలో సంస్థాగత బలోపేతం, సభ్యత్వ విస్తరణ, ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

## మహిళల సమస్యల పరిష్కారానికి కృషి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక మహిళా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి మహిళలు హాజరై తమ సమస్యలను వివరించగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## సోషల్ జస్టిస్ పురస్కారం అందుకున్న తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): విధినిర్వాహణలో ప్రజా సమస్యలపై సానుకూలంగా స్పందిస్తు సమస్యల పరిష్కార కార్యాచరణలొ ప్రజలు మెచ్చిన అధికారి, తెనాలి మండల తహశీల్దార్ గా, గ్రామపంచాయతీల ప్రత్యేక అధికారిగా విధి నిర్వాహణలొ నిబద్దతగా వ్యవహరించే, కెవి. గోపాలకృష్ణ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలలో, ఐతానగర్ బిఎస్ఎ యూత్ సభ్యులు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలొ సోషల్ జస్టీస్ అవార్డుతొ, మనసున్న మండల మెజిస్ట్రేట్ బిరుదును అందుకున్నారు. ఈసందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతు బిఎస్ఎ యూత్ సభ్యులు తనపై చూపుతున్న అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు. సామాజిక న్యాయం సాధనకోసం, ఓ అధికారిగా తన బాధ్యతను రెట్టింపు చేశారని, ప్రభుత్వ నిబంధనలకు లోబడి, విధినిర్వాహణలొ, అర్హులు,సామాన్యులైన,ప్రజలకు వారి ప్రయోజనాలను చేరువ చేయడంలొ చిత్తశుద్దితొ బాధ్యతగాపనిచేస్తా అన్నారు. ప్రజల విశ్వాసమే తనకు బలమన్నారు. వారికి సేవ చేయడం తన ధర్మమన్నారు. బిఆర్. అంబేద్కర్ మహోన్నత ఆశయాలైన, సామాజిక న్యాయం, సమానత్వం విధినిర్వాహణలొ భాగం చేసుకుని తన కర్తవ్యాలను నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా తొలుత భారత రత్న బిఆర్. అంబేద్కర్ విగ్రహం చెంత పువ్వులుంచి ఘనంగా నివాళులు అర్పించారు. యూత్ ఆధ్వర్యంలొ ఏర్పాటు చేసిన స్వఛ్చంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలొ బొనిగల ప్రదీప్, బొనిగల ప్రవీణ్, కారుమంచి సునీల్, విజయ్, దేవరపల్లి నాగరాజు, సంతోష్, ఏసుబాబు, బి. దీన రాజ్,ప్రభాకర్, బెనహర్, రవికుమార్, మేకతోటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై ఆరా



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని తోటపల్లి గ్రామ సమీపంలో ఉన్న డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మహా గురుకులం లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను మీడియా నిన్న బటబయ్యలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు మరియు మైదుకూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శీలం నరసింహ గౌడ్ మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పినటువంటి ప్రతి సమస్యను ఆలకించారు. అనంతరం అక్కడే ఉన్న ప్రిన్సిపల్ ఉమామహేశ్వరుడు ను వివరణ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చెప్పిన ప్రతి సమస్యను మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. బ్రహ్మంగారి మఠం మండలాన్ని ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ప్రయత్నిస్తుంటే అధికారులు ఇటువంటి తప్పిదాలతో మచ్చ తేస్తున్నారని ఆయన సిబ్బందిపై మండిపడ్డారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో విద్యార్థులకు ఎంతో రుచికరమైన పౌష్టికాహారం అందిస్తుంటే అధికారులు తప్పిదం వల్ల విద్యార్థులకు పూర్తిగా మెనూ పాటించడం లేదని ఆయన పేర్కొన్నారు.

# భారతరత్న డా. బి. ఆర్. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
- **గత ప్రభుత్వం దళితులపై వివక్ష చూపి, విదేశీ విద్య పథకం పేరును తొలగించింది**
- **సొంత పేరు పెట్టుకున్నారని మంత్రి విమర్శ**
- **33 శాతం రిజర్వేషన్ తో మహిళలు చట్టసభల్లోకి అడుగు పెట్టే రోజు వస్తుంది**



శ్రీకాకుళం, (జర్నలిస్ట్ ఫైల్): భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దామని అన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కులు, అణగారిన వర్గాల సాధికారత కోసం ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను కార్యరూపంలో అమలు చేసిన పార్టీగా తెలుగుదేశం పార్టీ నిలిచిందని తెలిపారు. దేశంలో ఏ ఒక్కకులానికి, మతానికి, పౌరుడికి ఇబ్బంది కలగకుండా రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. పేద కుటుంబంలో జన్మించినప్పటికీ విద్య ద్వారా గొప్ప వ్యక్తిగా ఎదిగారని చెప్పారు. దళిత కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వంటి చర్యలు తీసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. అంబేద్కర్ కలలుగన్న సమాన సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని, ఆ దిశగా ప్రజలందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లుతో చట్టసభల్లో 33 శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దళితుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

ప్రపంచంలో బలమైన ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలవడానికి అంబేద్కర్ అందించిన రాజ్యాంగమే కారణమని మంత్రి అన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే సమయానికి అన్ని సదుపాయాలు సిద్ధంగా ఉండేలా అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

**అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని ప్రవేశపెట్టాం... దాన్ని దుర్మార్గులు తొలగించారు**

ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు బేద్కర్ విదేశీ విద్య పథకాన్ని ప్రవేశపెట్టాము, కానీ దుర్మార్గులు దాన్ని తొలగించారు. దళితుల ఉన్నత విద్య కోసం విదేశాల్లో చదువుకునేందుకు 2014-2019 కాలంలో అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. అయితే, గత ప్రభుత్వం దళితులపై వివక్ష చూపి, ఆ పథకం పేరును తొలగించి తమ సొంత పేరు పెట్టుకున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. గత ప్రభుత్వంలో దళితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. తెలుగు దేశం ప్రభుత్వంలోనే దళితులకు సముచిత స్థానం లభిస్తుందని గుర్తు చేశారు.

**సబ్సిడీపై ఆటోలు పంపిణీ చేసిన మంత్రి**

మంత్రి సబ్సిడీపై మహిళలకు ఆటోలను పంపిణీ చేశారు. మహిళలు నేటి మహారాణులని మంత్రి అన్నారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం అందించిన సబ్సిడీతో ఆటోలను మహిళలకు మంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో శాసన సభ్యులు గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కె.వి.మహేశ్వర,జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, దళిత సంఘాల నాయకులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ ఒక కులం, మతం, ప్రాంతానికి పరిమితమైన నాయకుడు కాదని, విశ్వజనీన నాయకుడని ఆ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీజేపీ ముందుంటుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అట్టడుగు వర్గాలకు గౌరవం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా 'అంత్యోదయ' సిద్ధాంతాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో మోదీని 'నవయుగ అంబేద్కర్'గా అభివర్ణించారు.

రాష్ట్రంలో కూడా మాధవ్ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనలో, సామాజిక న్యాయం సాధనలో బీజేపీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, నేతలు పద్మజ, కంభంపాటి మాధవి, కోలపల్లి గణేష్, పైలా సురేష్, మువ్వల వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వేళంగిని నగర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెజ్జం అనిల్, టీడీపీ రాష్ట్ర నాయకులు మద్దిరాల మ్యాని, డివిజన్ అధ్యక్షులు తెలగతోటి సుధీర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, చలివేంద్రం ప్రారంభం చేయడం జరిగింది. అదేవిధంగా అన్నదాన కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాకుండా సమాజాన్ని మార్పు దిశగా నడిపించిన మహత్తర శక్తి అని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, అంటరానితన నిర్మూలనకు ఆయన చేసిన కృషి అపారమని అన్నారు. నేడు ప్రతి భారతీయుడు స్వేచ్ఛగా, హక్కులతో జీవించగలుగుతున్నాడంటే అది అంబేద్కర్ గారు అందించిన రాజ్యాంగం వల్లనే సాధ్యమైందని ఆమె తెలిపారు. ఆయనను "ప్రప్రథమ యోధుడు"గా అభివర్ణిస్తూ, నాయకులుగా ఎదగాలనుకునే ప్రతి ఒక్కరికీ అంబేద్కర్ గారు ఆదర్శమని అన్నారు. భారతదేశం ఉన్నంత కాలం, రాజ్యాంగం ఉన్నంత కాలం అంబేద్కర్ గారి ఆశయాలు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్న ఆమె, ఆయన స్ఫూర్తితో సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## "పీఎం సూర్య ఘర్"పథకం కింద గుంటూరు 21వ డివిజన్‌లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ ప్యానెల్స్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):ఆంధ్రప్రదేశ్ ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందించే లక్ష్యంతో "పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన" పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంగళవారం 21వ డివిజన్ యతిరాజుల కాలనీలో ఘనంగా జరిగింది. లబ్ధిదారురాలు పున్నమ్మ కుటుంబానికి తొలి సోలార్ ప్యానెల్స్‌ను ఎమ్మెల్యే గళ్ళా మాధవి విద్యుత్ అధికారులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన "పీఎం సూర్య ఘర్" పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ అందించడం ఎంతో సంతోషకరమని, ఒక్కో ఇంటికి సుమారు రూ. 1.20 లక్షల వ్యయంతో ఈ ప్యానెల్స్ ఏర్పాటు చేయబడుతున్నాయని చెప్పారు. ఇది విద్యుత్ ఖర్చులను తగ్గించడమే కాకుండా, ప్రకృతి నుంచి లభించే సౌరశక్తిని వినియోగించి కుటుంబాలు స్వయం సమృద్ధిగా మారేందుకు దోహదపడుతుందని అన్నారు. ముఖ్యంగా, అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను భవిష్యత్తులో వినియోగించుకునే లేదా అమ్ముకునే అవకాశాన్ని కూడా ఈ పథకం కల్పిస్తుందని వివరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో దాదాపు 2000 మంది లబ్ధిదారులను గుర్తించి దశలవారీగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామని, మొత్తం రూ. 2.6 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. డాబా ఉన్న ఇళ్లలో ముందుగా ఏర్పాటు చేసేలా ప్రత్యేకంగా పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు.

దేశంలో స్వయం సమృద్ధి ఆర్థిక వ్యవస్థ నిర్మాణం దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో ఈ పథకం అమలు అవుతోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఈ అద్భుత పథకాన్ని తీసుకొచ్చిన కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు, ముఖ్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి లబ్ధిదారుల తరఫున ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఇాజు, ఐజు అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సమాజ చైతన్య కథాంశ చిత్రానికి క్లాప్ కొట్టిన తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):సమాజంలోని అసమానతలను అధిగమించే, చైతన్యానికి సినిమా ఓ మాధ్యమమని ఆదిశగా యువదర్శకులు తెనాలి ప్రాంతానికి కళారంగానికి ఉన్న ప్రాధాన్యతను చాటేతీరుగా రాణించాలని, మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ పేర్కొన్నారు. కళల కణాచి తెనాలిలో యువదర్శకులు మణి వరన్ చింతా, నరేష్‌దోనెల సారధ్యంలొ. స్థానిక తెనాలి రామ కృష్ణకవి కళాక్షేత్రం లో మంగళవారం ఉదయం శ్రీ శ్రీ మీడియా బ్యానర్ పై మునిపల్లి శ్రీకాంత్, భూక్యా కుమార్ నాయక్ లు నిర్మాతలుగా ప్రొడక్షన్ నెంబర్ వన్ చలన చిత్ర, నిర్మాణ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో ముఖ్య అతిధి గా పాల్గొన్న తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్. డి. సి ద్వారా చిత్ర నిర్మాణాలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. తెనాలి కళా రంగానికి ఉన్న ప్రాధాన్యతను ఈ చిత్రం ద్వారా చాటాలన్నారు. సమాజ చైతన్యకథనంతో సాగే, చిత్రం సకాలంలో నిర్మాణం పూర్తి చేసుకోవాలని, మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మరో అతిధి డాక్టర్ పవని ప్రియాంక మాట్లాడుతు తెనాలి ప్రాంత కళాకారుల విశిష్టతను వివరించారు.

ఆంధ్ర ప్రదేశ్ చిత్ర నిర్మాణాలకు అనువైన ప్రాంతమని చెప్పారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు సంఘం తరపున యువ కళాకారులకు ప్రోత్సహిస్తున్నామన్నారు. తెనాలి ప్రాంతం నుంచి యువ కళాకారులు సినీరంగం లో ఎదగాలన్నారు. తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శి, సంగీత దర్శకుడు, సీనియర్ జర్నలిస్ట్ బొల్లిముంత కృష్ణ నూతన ప్రయత్నానికి శుభాశీస్సులు అందించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాది బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ సినిమా పవర్ ఫుల్ వెపన్ అని సమాజం లో సినిమా ప్రభావం ఉంటుందని వ్యాపార ధోరణిలో కాకుండా మంచి సందేశాత్మకంగా రూపొందించడం అభినందనీయం అన్నారు. డాక్టర్ కారుమంచి రవికుమార్, జర్నలిస్ట్ సునీల్ సందీప్, సినీ నిర్మాత, కథానాయకుడు రఘు, రాష్ట్ర బుద్ధిస్ట్ సంఘం వైస్ ప్రెసిడెంట్ అశోక్, దర్శకుడు కనపర్తి రత్నాకర్, మధుకర్ లు చిత్ర యూనిట్ కు అభినందనలు తెలిపారు. అనంతరం నటీనటులపై తహశీల్దార్ గోపాలకృష్ణ క్లాప్ కొట్టి గౌరవ దర్శకత్వం వహించారు. పవని ప్రియాంక కెమెరా పూజ నిర్వహించి, ప్రారంభించారు. కార్యక్రమం లో నటీనటులు పాల్గొన్నారు.

## మహా గురుకులంలో సమస్యలు ఫుల్ - వసతులు నిల్



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ): మహా గురుకులంలో విద్యార్థుల సమస్యలు పట్టించుకునే నాథుడే లేరని సిపిఐ మండల కార్యదర్శి పెద్దలపల్లె ప్రభాకర్, సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్, ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు జ్ఞానేశ్వర్రావు, ఎంఎస్పి మండల అధ్యక్షుడు సగిలి సుభాష్ లు పేర్కొన్నారు. మంగళవారం సిపిఐ, సిపిఎం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తోట్లపల్లి మహా గురుకులంను సందర్శించడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...... విద్యా సంవత్సరం ప్రారంభంలో ఎంతో అట్టహాసంగా ప్రారంభం చేసిన మహా గురుకులం విద్యా సంవత్సరం పూర్తవుతున్న కూడా అక్కడ ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పించకుండా వారి సమస్యలు పరిష్కరించకుండా జిల్లా డిసిఒ మరియు అక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థులు సమస్యలను గాలిపదలారని వారు పేర్కొన్నారు. దాదాపు సంవత్సరం కావస్తున్న విద్యార్థుల మౌలిక వసతులైన త్రాగడానికి సరైన నీటి సదుపాయం లేకుండా అదే విధంగా స్నానం చేయడానికి నీరు మరియు మరుగుదొడ్లు అపరిశుభ్రంగా మరుగుదొడ్లల్లోకి నీరు సరఫరా ఆగిపోయిన విద్యార్థుల బాగోగులు చూడాల్సిన ప్రిన్సిపల్ కనీసం విద్యార్థుల మౌలిక వసతులపై చర్యలు తీసుకోకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎవరైనా విద్యార్థుల తల్లిదండ్రులు వారి సమస్యలు చెప్పడానికి వెళ్తే నన్ను ఇక్కడి నుంచి బదిలీ చేయండి అంటూ సమస్యలను పక్కదారి పట్టిస్తున్నాడు. విద్యార్థులకు ఇవ్వాల్సిన మెనూలో అవకతవకలు చేస్తూ వార్డన్ మరియు ప్రిన్సిపల్ విద్యార్థుల కడుపు కొడుతున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు వారంలో రెండుసార్లు చికెన్ ఇవ్వాల్సి వస్తే ఒక్కో విద్యార్థికి 360 గ్రాములు వారంలో రెండు సార్లు ఇవ్వాలి కేవలం ఒక విద్యార్థికి 120 గ్రాములు చికెన్ ఇస్తూ మిగిలిన 40 గ్రాములు విద్యార్థుల సొమ్మును అప్పనంగా స్వాహా చేస్తున్నారని వారు పేర్కొన్నారు. విద్యార్థులకు డైనింగ్ హాల్ చుట్టూ అపరిశుభ్రంగా ఉంది. విద్యార్థులు హాస్టల్ నుంచి స్కూలుకు పోయే దారిలో మధ్యలో చెక్ డ్యామ్ వాగు పెద్దగా ఉండడంతో విద్యార్థులు కిందపడి గాయాలపాయలవుతున్న కూడా ప్రిన్సిపాల్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడ విద్యార్థుల పరిస్థితిని పట్టించుకునే నాధుడే లేదని వారు ఆరోపించారు. ఉన్నఫలంగా పాత గురుకులంలో ఉన్న విద్యార్థులను మహా గురుకులంలోకి తరలించడంతో సరైన సిబ్బంది, వర్కర్ల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో ఉన్న పాత గురుకులాన్ని రాబోయే విద్యా సంవత్సరంలో యధావిధిగా కొనసాగించి మహా గురుకులంకి కొత్త అడ్మిషన్లు చేర్చుకొని స్కూలును అభివృద్ధి చేయాలని వారు పేర్కొన్నారు. పాత గురుకుల పాఠశాల సిబ్బంది క్వార్టర్స్ లో ఉంటూ అక్కడ ఉన్నటువంటి కరెంటు వైర్లు ట్యూబులు ఫ్యాన్లు లాంటివి అమ్ముకోవడం వారి ఇళ్లకు తీసుకువెళ్లడం జరుగుతుందని ఆరోపణలు వస్తున్నాయి. వీటిపైన తక్షణమే డిసిఓ గారు పరిశీలించి ఈ విధంగా పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకొని విధుల నుండి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. తోట్లపల్లి మహా గురుకులంలో నాకు ఇబ్బందిగా ఉంది అన్నటువంటి ప్రిన్సిపాల్ ను బదిలీ చేసి కొత్త ప్రిన్సిపల్ ను ఇక్కడ కేటాయించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి యువజన ప్రజా సంఘాల రాజకీయ పార్టీలుగా ఉద్యమాలకు శ్రీకారం చెబుతామని వారు హెచ్చరించారు.

# నారాయణపూర్ గ్రామసభలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం



**గంగాధర (జర్నలిస్ట్ ఫైల్) :** గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ పంచాయతీలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం రోజున గ్రామసభ నిర్వహించడం జరిగింది ఈ గ్రామసభ కార్యక్రమంలో Village Level Road safety committee గ్రామంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలు పాటించేలా అవగాహన కల్పించడానికి కమిటీ ఏర్పాటు చేసి రోడ్డు భద్రత పై గ్రామసభ జరిగింది. ప్రతి ఒక్కరూ హెల్మెట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని,మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని గ్రామసభలో సర్పంచి దీకొండ బాబలక్ష్మి–మధు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బత్తిని వెంకటరమణ గ్రామ కార్యదర్శి దీపక్ కుమార్ పాలకవర్గ సభ్యులు సేఫ్టీ కమిటీ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మైనార్టీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభ





**గంగాధర (జర్నలిస్ట్ ఫైల్) :** గంగాధర మండల కేంద్రములోని మైనార్టీ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ G వారుణి ఒక ప్రకటనలో తెలిపారు ఇంటర్ ద్వితీయ సంవత్సరం లో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు ఇంటర్లో CECలో జాస్మిన్ 965 మార్కులు, పావని 957, శిరీన్ 950 మార్కులతో,MEC విభాగంలో మౌనిక 957,రుత్విక 933 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం లో CEC లో కుల్ సుమ్ 469,సదాఫ్ 459, MEC లో సౌమ్య 487, రక్షిత 466, సంధ్యారాణి 459 మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు అత్యుత్తమ ఫలితాలు సాధించినందుకు గాను సోమవారం రోజున ఉపాధ్యాయులను, విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించడం జరిగింది.

# రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం




**పిట్లం, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** పిట్లం గ్రామ పంచాయతీ పరిధిలో పిట్లం నూతన ఎస్సై ఆంజనేయులు గారు ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పిట్లం పోలీస్ శాఖ రహదారి భద్రత అనేది ఒక రోజు కార్యక్రమం కాదు… ఒక నిరంతర ఉద్యమమని ప్రజలకు తెలియజేసింది.పిట్లం సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్ మాట్లాడుతూ, రహదారి భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.అనంతరం అక్కడ ఉన్న ప్రజలతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు.

# అంబేద్కర్ జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు



**రాయికల్, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం,మూటపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ఎంపీపీఎస్ పాఠశాలల విద్యార్థులలో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు "మూటపెల్లి హెల్పింగ్ హ్యాండ్స్" ఆధ్వర్యంలో విశిష్ట కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా జ్యోతి రావు పూలే మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా వారి మహనీయ జీవితం, సేవలపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు.ఈ పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆలోచనలు, అభిప్రాయాలను చక్కగా వ్యక్తపరిచారు. విజేతలతో పాటు పాల్గొన్న విద్యార్థులకు పుస్తకాలు మరియు స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో "మూటపెల్లి హెల్పింగ్ హ్యాండ్స్" సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# కేసీఆర్ బహిరంగ సభకు సన్నాహక సమావేశం



**జగిత్యాల, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 20న నిర్వహించనున్న కేసీఆర్ బహిరంగ సభకు సంబంధించి సన్నాహక సమావేశం మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధ్యక్షతన జగిత్యాలలో నిర్వహించారు. రూరల్, అర్బన్ మండలాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు .గ్రామాల నుంచి వేలాది మందిని సభకు తరలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు. కేసీఆర్ పాలనలో రైతు బంధు, రైతు బీమా, పెన్షన్లు, బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్టు తెలిపారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. ప్రజలు ప్రస్తుత పాలనపై విసుగుచెందుతున్నారని, కేసీఆర్ మళ్లీ రావాలనే అభిప్రాయం పెరుగుతోందన్నారు.ఈ నెల 20న జరిగే సభకు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# అగ్నిపథంలో నిరాశ్రయుల బతుకులు సమాజాన్ని ప్రశ్నిస్తున్న మౌన వేదన





**నిర్మల్ , ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** నిర్మల్ జిల్లాలో ఎండ తీవ్రత రోజురోజుకీ పెరిగిపోతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ డీహైడ్రేషన్ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అయితే ఇదే మండే ఎండలో రోజంతా జీవనం సాగించే నిరాశ్రయుల పరిస్థితి మాత్రం మరింత హృదయ విదారకంగా మారింది.పట్టణంలోని ప్రధాన ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద వాహనాలు ఆగిన ప్రతిసారి కనబడే దృశ్యాలు మనసును కలచివేస్తున్నాయి. చేతుల్లో పసిపిల్లలను ఎత్తుకుని భిక్షాటన చేస్తున్న మహిళలు, అలసిన అడుగులతో తిరుగుతున్న వృద్ధులు, మండుతున్న తారు రోడ్లపై సూర్యకిరణాలను నేరుగా ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తోంది.సాధారణ ప్రజలు కూడా ఎండ తీవ్రతను తట్టుకోలేక బయటకు రావడానికే భయపడుతున్న వేళ, తరచూ నీరు, మజ్జిగ తీసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ చాలామంది అస్వస్థతకు గురవుతున్నారు. కానీ ఈ నిరాశ్రయులు మాత్రం రోజుకు ఎనిమిది నుంచి పది గంటలపాటు ఎండలోనే గడుపుతూ బతుకుదెరువు కోసం పోరాడుతున్నారు. పసిపిల్లలను చేతుల్లో పెట్టుకుని అడుక్కోవడం, వృద్ధులు అలసిన అడుగులతో తిరగడం–ఈ దృశ్యాలు వారి జీవనాన్ని నిజమైన అగ్నిపరీక్షగా మారుస్తున్నాయి.ఎండలో ఎండుతూ… వానలో తడుస్తూ… చలిలో వణుకుతూ… కాలాలు మారినా ఈ వర్గం పరిస్థితి మాత్రం మారడం లేదు. ఇల్లు లేదు… ఆధారం లేదు… ఆదుకునే వారు లేరు… ప్రతి రోజు బతుకుదెరువు కోసం పోరాటమే వారి జీవితం.మన మధ్యలోనే ఇలా బతుకుతున్న ఈ ఒంటరి జీవితాలు సమాజానికి మౌన ప్రశ్నగా నిలుస్తున్నాయి. మానవత్వమే అసలైన ధర్మమైతే, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం… దాహంతో ఉన్నవారికి నీరు అందించడం… దిక్కులేని వారికి అండగా నిలవడం వంటి విలువలు మాటల్లో కాకుండా ఆచరణలో కనిపించాల్సిన అవసరం స్పష్టమవుతోంది.ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ముందుకు రావాల్సిన సమయం ఇదే. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఉన్నవారికి చల్లని నీరు, మజ్జిగ అందించడం, డబ్బులకంటే ఆహారం, పండ్లు ఇవ్వడం, చిన్నపిల్లలతో ఉన్నవారికి ప్రత్యేక సహాయం చేయడం, పాత దుస్తులు, గొడుగులు అందించడం వంటి చిన్న చర్యలు కూడా పెద్ద మార్పుకు దారితీయవచ్చు. అలాగే పట్టణంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అత్యవసరం.సిగ్నల్ వద్ద ఎరుపు లైట్ వెలిగినప్పుడు మనం వాహనాన్ని ఆపుతాం… కానీ మన హృదయం మాత్రం ఎందుకు ఆగదు? మన కళ్లముందే అగ్నిపథంలో నడుస్తున్న ఈ బతుకులను చూసి కూడా మనసు కదలకపోతే, మన మానవత్వం ఎక్కడ నిలబడిందో ఆలోచించాల్సిన సమయం ఇది.ఒక బాటిల్ నీళ్లు… ఒక పూట భోజనం… మనకు చిన్న సహాయమే కావచ్చు… కానీ వారికది ఒక రోజు జీవించే ఆశ.ప్రశ్న ఒక్కటే,మనము కేవలం చూస్తామా? లేక స్పందిస్తామా? మీ మనసుకే తెలియాలి

# దివంగత నేత శ్రీపాదరావు వర్ధంతి ఘన నివాళి



**రామమందిర్ ఏరియా, ఏప్రిల్ 14 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సోమవారం గోదావరిఖని బస్టాండ్ ఎదురుగా నిర్వహించిన దివంగత నేత దుద్దిళ్ల శ్రీపాద రావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేతగా దుద్దిళ్ల శ్రీపాద రావు నిలిచారని కొనియాడారు. ప్రజాసేవే ధ్యేయంగా కడవరకు సేవా మార్గంలో నడిచిన ఆయన జీవితం అందరికీ ఆదర్శమని తెలిపారు.మాజీ శాసనసభ స్పీకర్‌గా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత నాయకుడని పేర్కొన్నారు. దుద్దిళ్ల శ్రీపాద రావు వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ తెలిపారు.

# పూర్వ తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఘన సన్మానం



**రామమందిర్ ఏరియా, (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరిఖనిలో పూర్వ తెలుగుదేశం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రామగుండం డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్యకు ఘన సన్మానం నిర్వహించారు. గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ, పూర్వ తెలుగుదేశం నాయకులు తనకు ఇచ్చిన గౌరవం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. "రక్త సంబంధాలకంటే గొప్పది తెలుగు తమ్ముళ్ల బంధం. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ వల్లే నాకు ఈ స్థాయి సాధ్యమైంది. నాకు అవకాశం కల్పించిన గౌరవ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు,"అని అన్నారు. రామగుండం ప్రాంత అభివృద్ధికి తాను పూర్తిస్థాయిలో కృషి చేస్తానని స్పష్టం చేశారు.కోటగిరి పాపయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కన్నూరి సతీష్ కుమార్, బాలరాజ్ కుమార్,కార్మిక నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, కుల్ల వెంకటేశ్వర్లు, కత్రోజు మోహన్, అనుమా రాజమల్లు, చిప్ప రాజేశం, కుక్కల రాజయ్య, మీసాల కృష్ణ, కొమ్ము మధునయ్య, మొలుగురి వీరయ్య, జక్కుల సతీష్, పులి మహేష్, పెనుగొండ శ్రీనివాస్, తోట రవి, జనగామ కుమార్, పోయల్ రవి, నూనె లత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# "అరైవ్ అలైవ్"తో రోడ్డు భద్రతపై అవగాహన





**- భూపతిపూర్‌లో చైతన్య కార్యక్రమం**

**రాయికల్, ఏప్రిల్ 14(జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం భాగంగా సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సై సుధీర్ రావు, సర్పంచ్ గుర్రం భావన ఆధ్వర్యంలో చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఎస్సై సుధీర్ రావు గ్రామ ప్రజలకు కీలక సూచనలు చేసి అవగాహన కల్పించారు.గ్రామ పరిధిలోని రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, ప్రమాదాలకు కారణమయ్యే గుంతలను పూడ్చి రహదారులను సురక్షితంగా మార్చే చర్యలు చేపట్టారు. ఈ చర్యలతో గ్రామంలో రోడ్డు భద్రత మరింత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మూగల సంజీవ చారి, ఆర్ఐ పద్మయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామ వార్డు సభ్యులు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి మరియు రోడ్డు భద్రత కోసం ఇలాంటికార్యక్రమాలు కొనసాగించాలనిప్రజలు అభిప్రాయపడ్డారు.

# ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



**:123 మందికి పరీక్షలు**

**:21 మందికి శస్త్రచికిత్సకు రిఫర్**

**రాయికల్, ఏప్రిల్ 14(జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు స్నేహ, గాయత్రి మొత్తం 123 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో సమస్యలు గుర్తించిన 21 మందిని కరీంనగర్ నగునూరులోని ప్రతిమ ఆసుపత్రికి రిఫర్ చేశారు.రిఫర్ చేసిన రోగులకు మంగళవారం ఉచిత బస్సు సౌకర్యం కల్పించి, ప్రతిమ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భావన, మార్కెటింగ్ సిబ్బంది ప్రకాష్ రావు, శ్యామల, ఉపసర్పంచ్ మూగల సంజీవచారి, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, గ్రామీణ వైద్యులు జలంధర్, ప్రసాద్, వార్డు సభ్యులు రాము, కొమురయ్య, శేఖర్, గంగారెడ్డి పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షలు ముగింపు



**- విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది**

**రాయికల్, ఏప్రిల్ 14(జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 14న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు సోమవారంతో విజయవంతంగా ముగిశాయి. చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం రాసిన అనంతరం విద్యార్థులు ఆనందంతో బయటకు వచ్చి తమ మిత్రులతో కలిసి ఉత్సాహంగా గడిపారు.రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర మరియు బాలికల పాఠశాల కేంద్రాలలో పరీక్షలు రాసిన విద్యార్థులు పరీక్షలు పూర్తవడంతో సంతోషం వ్యక్తం చేశారు. పరీక్షలు బాగా రాశామని ఒకరికొకరు చెప్పుకుంటూ, ప్రశ్నాపత్రాలపై చర్చించుకుంటూ కనిపించారు.పరీక్షల ఒత్తిడి ముగియడంతో విద్యార్థుల ముఖాల్లో ఆనందం స్పష్టంగా కనిపించింది. కొందరు విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యాలపై చర్చించగా, మరికొందరు సెలవులను ఎలా గడపాలనే విషయంపై స్నేహితులతో మాట్లాడుకున్నారు. పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సందడితో కిక్కిరిసిపోయి, పరీక్షల ముగింపు వేళ ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

# ప్రభుత్వ పాఠశాలపై నమ్మకం పెంచిన ఉప సర్పంచ్




**- తన పిల్లలకు అడ్మిషన్ తీసుకుని ఆదర్శం**

**-:ఆలూరులో బడి బాట కార్యక్రమం**

**రాయికల్,(జర్నలిస్ట్ ఫైల్) :** బడి బాట కార్యక్రమంలోభాగంగా సోమవారము రాయికల్ మండలం ఆలూరు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఒక విశేష సంఘటన చోటు చేసుకుంది. గ్రామ ఉప సర్పంచ్ సల్ల మహేష్ తన ఇద్దరు కుమారులు స్నేహిత్ రెడ్డి, తన్విష్ రెడ్డి లను వరుసగా 4వ తరగతి, 1వ తరగతిలో అడ్మిషన్ తీసుకుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం ద్వారా గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నల్లాల స్వామి మాట్లాడుతూ, అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలో ఉప సర్పంచ్ తన పిల్లలను చేర్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే, మిగతా తల్లిదండ్రులు కూడా ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్కినపల్లి సతీష్, ఉపాధ్యాయులు సునీత, సాయికృష్ణ,రమేష్ రెడ్డి, ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ లక్ష్మయ్య, విద్యాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిలుక సంజీవ్, కార్యదర్శి నల్లాల శేఖర్, మాజీ సర్పంచ్ గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్, గ్రామ కార్యదర్శి రమ్యతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కడప నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ప్రేమ జంట మీడియా సమావేశం



**(జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా చాపాడు మండలం యువకుడు సుమంత్, యువతి స్రవంతి వివాహం… ఇద్దరూ మేజర్లు కావడంతో స్వచ్ఛందంగా పెళ్లి చేసుకున్న జంట… రాయచోటి బైపాస్ రామాలయంలో సింపుల్‌గా వివాహం.. కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని జంట ఆందోళన.. తమకు రక్షణ కల్పించాలని మీడియా ముందుకు విజ్ఞప్తి మీడియా సమావేశం… అనంతరం జిల్లా ఎస్పీని కలిసిన జంట.. ఎస్పీకి వినతిపత్రం సమర్పించిన సుమంత్, స్రవంతి.. ప్రేమ వివాహంపై కుటుంబాల నుంచి వ్యతిరేకత ఉన్నట్లు సమాచారం… భద్రత కల్పించాలని పోలీసులకు జంట అభ్యర్థన….

# అంబేద్కర్ గొప్ప స్ఫూర్తి ప్రదాత



○ అంబేద్కర్ జయంతి సభలో జిల్లా కలెక్టర్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** డా.బి.ఆర్ అంబేద్కర్ గొప్ప స్ఫూర్తి ప్రదాత అని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ మంగళవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త, మహానేత, సామాజిక న్యాయానికి ప్రతీక డా. బి.ఆర్. అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే మహత్తర విలువలను సమాజంలో స్థాపించేందుకు తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులు, అవకాశాలు కల్పించిందని చెప్పారు.
సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలను ఆచరణలో పెట్టాలని, సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. విద్య, న్యాయం, సమాన హక్కులు అనే ఆయన సందేశం నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. అంబేద్కర్ ఆశయాలను సాకారం చేసుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు అందరం కలిసి ఆయన చూపిన మార్గంలో నడిచి సమానత్వభారతాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ అలీం భాషా, అదనపు కమిషనర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో... నాణ్యతాప్రమాణాలు పాటించాలి



○ కమీషనర్ జె. రామ అప్పలనాయుడు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని పలు కూడళ్ళలో పురపాలక సంఘం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను ఓకార్యచరణగా కొనసాగిస్తున్న క్రమంలో, మున్సిపల్ కమీషనర్ జె. రామ అప్పలనాయుడు క్షేత్ర స్థాయిలో అభివృద్ధిపనుల నిర్మాణంలొ ఎప్పటికప్పుడు పరిశీలిస్తు, ఇంజనీరింగ్ విభాగానికి తగు చేస్తున్నారు. ఈక్రమంలొ మంగళవారం మున్సిపల్ కమిషనర్ రామా అప్పలనాయుడు పట్టణం లోని 16 వ వార్డులోని,సీతాంబ హోటల్ సమీపం లో జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలిశీచి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పనులు వేగవంతంగా పూర్తి అయ్యే విధంగా చూడాలని సిబ్బంది కి సూచించారు. మురుగు నీరు రోడ్ల పైకి చేరకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సుచించారు. అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు , సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** భారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత డా బి ఆర్ అంబెడ్కర్ 135 వ జయంతి వేడుకలను కాకుమాను మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంబెడ్కర్ వలననే దేశంలో అసమానతలను తొలగించి వేసారన్నారు. నేడు అన్ని వర్గాల ప్రజలు సమాజంలో గర్వంగా జీవిస్తున్నారంటే దానికి అంబెడ్కర్ వలననే అని తెలిపారు. ప్రతి ఒక్కరు డా బి ఆర్ అంబెడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోని జీవితంలో ఉన్నంతంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు ఎన్ పూర్ణ చంద్ర రావు, శ్రీధర్ శర్మ, వెంకట లక్ష్మి,సంపత్, శరత్ బాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

○ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబాసాహెబ్ అంబేద్కర్ కి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించడం ఎంతో గౌరవంగా భావిస్తున్నామని, అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాకుండా, సమాజంలో మార్పుకు, పోరాటానికి, సమానత్వానికి ప్రతీకగా నిలిచారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. సమాజంలో మార్పు తీసుకువచ్చిన మహానుభావులను ఏ ఒక్క వర్గానికో, మతానికో పరిమితం చేయకూడదని, అంబేద్కర్ గారు అందరి నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అంటరానితనం నిర్మూలన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని చెప్పారు.
అంబేద్కర్ సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి, చీకటిని చీల్చుకుని వెలుగునిచ్చిన మహానుభావుడిగా నిలిచారని అభివర్ణించారు. ఆయన చూపిన మార్గంలో నడవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని, మహిళల సాధికారత కోసం అంబేద్కర్ తీసుకొచ్చిన చట్టాలు, బిల్లులు ఎంతో గొప్పవని, మహిళగా తాను ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణలో ఆయన పాత్ర అపారమని, అంబేద్కర్ గారు భారతదేశం ఉన్నంతకాలం ప్రతి భారతీయుడి హృదయంలో చిరస్థాయిగా నిలిచే మహనీయుడని, ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# చిరస్మరణీయులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

○ కర్లపాలెం ఎస్ ఐ రవీంద్ర



**కర్లపాలెం (జర్నలిస్ట్ ఫైల్ ):** భారత రాజ్యాంగం ద్వారా సమ సమాజ స్థాపన కొరకు విశేషకృషిచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజలందరీ హృదయాల్లో చిరస్మరణీయులు గా నిలిచి ఉన్నారని కర్లపాలెం ఎస్ ఐ రవీంద్ర పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న,ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో యాజలి గ్రామం నందు అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్న కర్లపాలెం ఎస్ ఐ రవీంద్ర పాల్గొని మాట్లాడుతూ ఆనాటి సమాజంలోని అంటరానితనం, సామాజిక అసమానతలను రూపు మాపుట కొరకు అంబేద్కర్ అలుపెరుగని పోరాటం చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలు, దళితులకు అనేక చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపుట కు విశేష కృషి చేశారని తెలిపారు. విద్య ద్వారానే సామాజిక ఆసమానత లు తొలగి పోతాయి అని భావించి, చదువు - చదివించు, అభివృద్ధి చెందు అని అంబేద్కర్ తెలిపారని, విద్యార్థులందరూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా చక్కగా చదువుకొని అభివృద్ధి చెందాలని కోరారు. అంబేద్కర్ ఆశయ సాధన కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అంబేద్కర్ జీవిత త్యాగ ఫలితమే భారతీయుల జీవన వికాసం అని తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు మిఠాయిలు పంపిణి చేశారు .అనంతరం ఎస్ ఐ రవీంద్ర ను యూత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో అంబెడ్కర్ యూత్ నాయకులు తానంగి లోకేష్, బోలిమేర వినీత్, ఏపూరి నాగేంద్ర, భూపతి వర్మ తదితరులు పాల్గొన్నారు.

# భారతరత్న డాక్టర్ బీఆర్. అంబేద్కర్ అందరివాడు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయుల త్యాగాల ద్వారా లభించిన స్వాతంత్ర్య ఫలాలు భారతీయులందరికి చేరువ చేయాలన్న మహాసంకల్పం నుండి వెలుగుచూసిన రాజ్యాంగ రచనలొ క్రియాశీలకంగా వ్యవహరించిన, మహనీయుడు భారతరత్న బిఆర్. అంబేద్కర్ కేవలం ఓ సామాజిక వర్గానికి, ఓప్రాంతానికి పరిమితం కాదని, భారతీయులందరికి బిఆర్. అంబేద్కర్ అభిమానపాత్రుడని పట్టణ టిడిపి నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక రామలింగేశ్వర పేటలోని, టిడిపి కార్యాలయంలొ మంగళవారం రాజ్యాంగ రూపశిల్పి, అంబేద్కర్ జయంతిని పురస్కరించు కుని, ఏర్పాటు చేసిన కార్యక్రమంలొ, అంబేద్కర్ చిత్రపటం చెంత పువ్వులుంచి ఘనంగా నివాళులు అర్పించారు. భారతరత్న స్థాయికి ఎదిగిన అంబేద్కర్ జీవితంలో, సామాజికంగా ఎదురైన సమస్యలు, భావితరాలకు ఉండకూడదన్న మహదాశయంతొ, రాజ్యాంగంలొ పొందుపరచిన రిజర్వేషన్ ఫలాలు అనుభవించే వారు, సమాజం పట్ల బాధ్యతగా, తోటివారికి తోడ్పడటమే, అంబేద్కర్ కు అందించే ఘననివాళి అని, అభిప్రాయాలు పంచుకున్నారు. కార్యక్రమంలొ పట్టణ పార్టీ అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్, బిసి విభాగం నాయకులు ఫణిదపు దుర్గాప్రసాద్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు,అత్తోట శరత్,కంచర్ల ఏడుకొండలు, హుసేన్, పార్టీ లోని వివిధ స్థాయి ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు





**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** తన జీవిత తుది శ్వాస విడిచే వరకు బడుగు బలహీన వర్గాలు దళితుల సంక్షేమం కోసం పోరాడిన పోరాట యోధుడు బిఆర్ అంబేద్కర్ అని న్యాయవాదులు కొనియాడారు. మంగళగిరి బార్ అసోసియేషన్ హాల్ లో మంగళవారం బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తొలుత ఆయన చిత్రపటానికి బార్ అధ్యక్ష కార్యదర్శులు జొన్నాదుల లెనిన్ బాబు, బేతపూడి నాయుడమ్మ వైస్ ప్రెసిడెంట్ కురగంటి రమేష్, న్యాయవాదులు కూరపాటి అంబేద్కర్ సూరబోయిన మురళీకృష్ణ డేనియల్ కాంతారావు రాజశేఖర్ బాబు ఇంకా పలువురు న్యాయవాదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పై వారితో పాటు న్యాయవాదులు బాలశౌరి ,ప్రదీప్, హైకోర్టు ఏజీపీ బేతపూడి రమేష్, మురళి రాజు, బుల్లా రమేష్ ,పాలకాయల వేణు, తదితరులు మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ అంటరానితనం నిర్మూలన కోసం కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడారన్నారు .దేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపన కోసం కీలక పాత్ర పోషించా రన్నారు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాతగా ప్రముఖ సంఘ సంస్కర్తగా ఖ్యాతి పొందారన్నారు. స్వతంత్ర భారత దేశపు మొదటి న్యాయ శాఖ మంత్రిగా పనిచేసే పదవికి వన్నెతెచ్చారన్నారు. ఆనాడు అగ్రవర్ణాల వివక్షతకు గురైన అంబేద్కర్ తన తుది శ్వాస విడిచే వరకు అంటరానితనం కుల వ్యవస్థ నిర్మూలన కోసం పోరాటం చేశారన్నారు. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు స్వేచ్ఛ మరియు సామాజిక న్యాయానికి చోటు కల్పించారన్నారు. ప్రపంచ మేధావిగా భారత రాజ్యాంగ నిర్మాతగా ప్రఖ్యాతి పొంది 1956లో అంబేద్కర్ మరణించారని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణానంతరం 1990లో దేశ అత్యున్నత భారతరత్న పురస్కారం లభించింది అన్నారు. నేడు కొందరు సామాజిక సమానత్వం కోసం పోరాడుతున్నారన్నారు, అది ఆనాడు అంబేద్కర్ చూపించిన బాటయే అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అవుతుందన్నారు.
ఇంకా ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ప్రదీప్ శ్రీనివాసరావు మాలపాటి సురేంద్ర ,కోటేశ్వరమ్మ, రాజ్యలక్ష్మి, ప్రవీణ్ ,అలా వెంకటస్వామి, సమీర్, గ్రంధి కుమారస్వామి, వింజమూరి భారతి రోశయ్య ఇంకా పలువురు పాల్గొన్నారు.

# విద్యే అంబేద్కర్ ఆయుధం



○ రాజ్యాంగ నిర్మాత జీవితం స్ఫూర్తిదాయకం

○ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ఘన నివాళులు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** విద్యనే ఆయుధంగా మలుచుకుని భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించిన గొప్ప సామాజిక సంఘ సంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం పాత గుంటూరు క్రిస్టియన్ పేట మెయిన్ రోడ్డు, గడ్డిపాడు మెయిన్ రోడ్డు, లాడ్జి సెంటర్, శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం, తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం, గుంటూరు తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయం వద్ద అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచారన్నారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని నమ్మి, సమాన హక్కుల కోసం పోరాడిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సామాజిక సంస్కర్తగా భారతదేశానికి ఎనలేని సేవలందించారని తెలిపారు. సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి విలువలను రాజ్యాంగంలో చేర్చారని, అందుకే ఆయనను "భారత రాజ్యాంగ పితామహుడు" అని పిలుస్తారని చెప్పారు. సమాజంలో కులవ్యవస్థను నిర్మూలించేందుకు ఆయన నిరంతరం పోరాటం చేశారన్నారు. అంబేద్కర్ రచించినాూఅఅఅష్ట్రఅశ్రీఫ్అశీఅ శీట ఋుర్వ అనే గ్రంథం సామాజిక సంస్కరణలకు ఒక గొప్ప దారిదీపంగా నిలిచిందని చెప్పారు. ఎన్ని కష్టాలు వచ్చినా మన లక్ష్యాన్ని వదలకుండా కష్టపడి ముందుకు సాగాలనే గొప్ప మార్గాన్ని తమ జీవితం ద్వారా తెలియజేశామని వివరించారు.

# రాజ్యాంగ పరిరక్షణకు పోరాటమే అంబేద్కర్ నిజమైన నివాళి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న సర్వ సమానత్వానికి కృషిచేసిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జన్మదిన వేడుకలు బ్రహ్మంగారిమఠం మండల స్థానిక ఎమ్మార్వో కార్యాలయం నందు ఉన్నటువంటి విగ్రహానికి మండల సీనియర్ టిడిపి నాయకులు ఎస్సార్ శ్రీనివాసరెడ్డి టిడిపి మండల ఉపాధ్యక్షులు శీలం నరసింహ గౌడ్ శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగినది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అంబేద్కర్ పేద దళిత కుటుంబంలో జన్మించి చిన్నతనం నుండి అనేక కష్టాలు ఎదుర్కొన్నారు పట్టుదల కృషితో వీధిలైట్లు దీపం కింద చదువుకొని కుల వివక్షతకు గురై స్వదేశంలో విదేశంలో ఉన్నత విద్యను అభ్యసించి రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు అంబేద్కర్ అందరివాడని కొందరు వాడు కాదని అందులో దళితులకు ఎక్కువ భాగం కృషి చేశారని తెలిపారు. గౌరవం కోసం బౌద్ధ మతాన్ని స్వీకరించారన్నారు దళితుల కోసం చట్టాలను రాజ్యాంగంలో చేర్చారన్నారు 8 గంటల పని వేళలు రిజర్వేషన్లు అమలు చేయాలని ఆనాడే చెప్పారని బిజెపి పెట్టుబడిదారులకు కార్పొరేట్లకు అనుకూలంగా కార్మిక చట్టాలు నాలుగు లేబర్ కోడులు మార్చిందని పాత పద్ధతిలో పోరాడి సాధించుకున్నప్పుడే నిజమైన అంబేద్కర్ నివాళులని తెలిపారు.

# పోలేరమ్మ సేవలో సినీ నిర్మాత బండ్ల గణేష్



**కాకుమాను, (జర్నలిస్ట్ ఫైల్ ):** సినీ నిర్మాత బండ్ల గణేష్ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన స్వయం భూ శ్రీ పోలేరమ్మ అమ్మవారి ని మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి లు నిర్మాత బండ్ల గణేష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా పూజా కార్యక్రమం లు చేశారు. ఆలయ అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్మాత బండ్ల గణేష్ మాట్లాడుతూ భక్తులను కాపాడే తల్లి కొండపాటూరు పోలేరమ్మ తల్లి అని అన్నారు. ప్రజలందరిని చల్లగా చూడాలని కోరారు.
తాను ప్రతి ఏడాది అమ్మవారిని దర్శించుకుంటానని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని మనసారా కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో ఆలయ ఈ ఓ జక్కా శ్రీనివాసరావు, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పొన్నం వీరయ్య చౌదరి, ట్రస్ట్ బోర్డు సభ్యులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# బిసి ధర్మ దీక్షను విరమించిన రామచంద్రయాదవ్

○ ఇది ముగింపు కాదు

○ ఇకపై ధర్మయుద్ధం కొనసాగుతుందని ప్రకటన



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** బీసీల హక్కుల సాధన కోసం బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్ చేపట్టిన బీసీ ధర్మదీక్ష నాలుగో రోజున తీవ్ర ఉద్రిక్తతల మధ్య ముగిసింది. నాలుగు రోజులుగా నిరాహారంగా ఉన్న ఆయన ఆరోగ్యం అత్యంత విషమంగా మారడంతో, వైద్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, బీసీ, కాపు సంఘాల పెద్దల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో ఆయన తన దీక్షను మంగళవారం సాయంత్రం విరమించారు. అంబులెన్స్ లో తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పార్టీ శ్రేణులు రామచంద్ర యాదవ్ ను తరలించారు. దీక్ష విరమణకు ముందు విలేకరుల సమావేశంలో బోడే రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ ఇది కేవలం విరామం మాత్రమేనని, బీసీల హక్కుల సాధన కోసం తన పోరాటం ఇకపై ధర్మయుద్ధంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.
భవిష్యత్ పోరాటాన్ని మరింత ఉధృతం చేసే లక్ష్యంతో ఆయన దీక్షను విరమిస్తున్నట్లు ప్రకటించారు. నాలుగో రోజు దీక్ష కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. ప్రతిపక్ష నేత జగన్ మోహన్ రెడ్డి కూడా స్పందించకపోవడం ఈ దోపిడీ, కుటుంబ పార్టీలకు బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని బయటపెడుతోంది అన్నారు. రాష్ట్రంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కాదు, కౌరవ ప్రభుత్వం అన్నారు. ఎపి అంటే అమరావతి, పోలవరం అని చంద్రబాబు చెప్పేది అభివృద్ధి కోసం కాదు, అవి ఆయన కుటుంబం ఏర్పాటు చేసుకున్న రెండు ఏటీఎంలు. పోలవరం ఒక ఏటీఎం అని సాక్షాత్తూ ప్రధాని మోదీయే చెప్పారు.
ఇప్పుడు అమరావతి అనే మరో ఏటీఎంను పెట్టుకుని, వేల ఎకరాలు సేకరించి తన బినామీలకు కట్టబెడుతున్నారని రామచంద్రయాదవ్ ఆరోపించారు. రాజధాని అమరావతి లో సేవా సంస్థ పేరుతో తన కోడలి పేరిట ఐదు ఎకరాల ఇరవై సెంట్ల స్థలంలో అక్రమంగా అధికార నివాసం నిర్మిస్తున్నారు. ఇది అమరావతి ఏటీఎంలో ఆయన చేసుకున్న మొదటి విత్‌డ్రాయల్. దీనిపై పూర్తి ఆధారాలున్నాయి, త్వరలో గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాను," అని ఆయన హెచ్చరించారు. అమరావతి చంద్రబాబు కుటుంబ ఆస్తి కాదని, రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు చెందిందని నిరూపించే వరకు, బీసీలకు వెయ్యి ఎకరాలు కేటాయించే వరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

**ధర్మదీక్షకు వెల్లువెత్తిన మద్దతు**

రామచంద్రయాదవ్ దీక్షకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి మద్దతు వెల్లువెత్తింది. కాపు జెఎసి నాయకులు దాసరి రాము, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు పర్వత సతీష్ కుమార్, తెలంగాణా నాయకులు బిల్లి చంద్రశేఖర్, ప్రముఖ బీసీ నాయకులు అంబర్‌పేట శ్రీనివాసయాదవ్, తెలంగాణా రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు వట్టి జానయ్య, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వెంకటేష్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి సతీష్, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివాజీ, ప్రముఖ కాపు నాయకులు సుధాకర్ నాయుడు, సీపీఐ కార్యదర్శి ఈశ్వరయ్య, గౌడ, శెట్టి బలిజ నాయకులు శ్రీనివాసరావు, బీసీ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు కుర్రం శ్రీనివాస్, బీసీ సంఘం నాయకులు మార్గాని చంటిబాబు, నేషనల్ పార్టీ ప్రెసిడెంట్ కనకం శ్రీనివాస్, మంగళగిరి మాజీ ఎంపీపీ ఆర్. మోహన్ బాబు, కర్ణాటక హైకోర్టు అడ్వకేట్ రాజ్ కుమార్, రాష్ట్ర గౌడ సంఘం మహిళా అధ్యక్షురాలు ధరం నాగరాణి సహా అనేక మంది నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు దీక్షకు సంఘీభావం ప్రకటించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# అభివృద్ధి-సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నాం

○ తెలుగుదేశం పార్టీ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయి

○ రూ.1000 కోట్లతో ఏడాదిన్నరలో నేరడీ బ్యారేజ్ పూర్తి

○ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**టెక్కలి (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో తాగునీరు మరియు సాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు సుమారు రూ.1000 కోట్లతో నేరడీ బ్యారేజ్‌ను ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం టెక్కలి మండలంలో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తెంబూరు రోడ్ నుండి పెద్దసాన--పరశురాంపురం వరకు పంచాయతీరాజ్, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.130 లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డు, పోలవరం నుంచి లచ్చన్నపేట వరకు రూ.120 లక్షల రహదారి, ఎంపీపీ పాఠశాల నుండి వంశధార కాలువ వరకు రూ.25 లక్షలతో రిటైనింగ్ వాల్, లచ్చన్నపేటలో రూ.12 లక్షల సీసీ రోడ్లు, కాలువలు, సీతాపురంలో రూ.55.30 లక్షల అంతర్గత సిమెంట్ రహదారులు-మొత్తం రూ.5.25 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ట్రిబ్యునల్ తీర్పుతో నేరడీ బ్యారేజ్ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.1000 కోట్ల నిధులు అవసరమని, ప్రాథమిక డిజైన్ పనులకు రూ.60 కోట్ల మంజూరుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా ఆలోచిస్తున్నారని తెలిపారు. బ్యారేజ్ పూర్తయితే జిల్లా సస్యశ్యామలం కావడంతో పాటు ముఖచిత్రం మారిపోతుందని అన్నారు.

జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.625 కోట్లను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరచి రూపురేఖలను మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప గత ఐదేళ్లలో పూర్తి స్థాయి కార్యక్రమాలు జరగలేదని మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తి చేయడంలో విఫలమైందని, అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితమైందని ఆక్షేపించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల ఆశలు నెరవేర్చే దిశగా కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

**2027 నాటికి ఇంటింటికి తాగునీరు :** 2027 సంవత్సరం చివరి నాటికి టెక్కలి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం తాగునీటి సదుపాయం అత్యంత కీలకమని పేర్కొంటూ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా పట్టణ స్థాయి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నామని చెప్పారు.

**2029 నాటికి ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు :** రాష్ట్రంలో 2029 నాటికి ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఈ లక్ష్య సాధన కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. “ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు పక్కా ఇల్లు కల్పించడమే మా సంకల్పం” అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పాల్గొన్న అధికారులుఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, డీఎల్డీఓ అలివేలు మంగ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం. సుధాకర్, తహసీల్దార్ సత్యం, ఎంపీడీఓ రేణుక, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి కె. ప్రసాద్ కృష్ణ, జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ భవిష్యత్తులో సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలుపుదాం



○ ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ క్వాంటం దినోత్సవం సందర్భంగా అమరావతిలోని ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీలో క్వాంటం టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం. ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పాల్గొన్నారు. ఇది కేవలం ఒక ప్రారంభోత్సవం మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక ప్రపంచంలో అగ్రగామిగా నిలబెట్టే చారిత్రాత్మక ఘట్టమని మన్నవ మోహన కృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి క్వాంటం మౌలిక వసతులు రాష్ట్రంలో ఏర్పాటు కావడం ద్వారా పరిశోధన, ఆవిష్కరణలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ఇది ఒక గొప్ప వేదికగా మారుతుందని అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటం టెక్నాలజీ రంగంలో నూతన యుగారంభమని ఆయన తెలిపారు. భారతదేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవడం గర్వకారణమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి వల్లే క్వాంటం టెక్నాలజీపై రాష్ట్రం ముందంజలో ఉందని, క్వాంటం కంప్యూటింగ్, కమ్యూనికేషన్, సెక్యూరిటీ రంగాల్లో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురానుందని కొనియాడారు.

అలాగే ఐటీ మంత్రి నారా లోకేష్ చురుకైన చర్యలు క్వాంటం రంగ అభివృద్ధికి దోహదపడుతున్నాయని, స్టార్టప్స్, పరిశోధనలు మాత్రమే కాకుండా యువతకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తూ కొత్త అవకాశాలను సృష్టిస్తున్నారని తెలిపారు.

క్వాంటం టెస్ట్ బెడ్స్ ద్వారా పరిశోధన, ఇన్నోవేషన్, పెట్టుబడులకు ఊతమిచ్చి ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగని మన్నవ పేర్కొన్నారు.

## భారతదేశ చరిత్రలో మహోన్నత వ్యక్తి బిఆర్ అంబేద్కర్



**జీలగలగండి(ఘంటసాల) (జర్నలిస్ట్ ఫైల్):** భారత రాజ్యాంగ ప్రధాన రూపశిల్పి మరియు సామాజిక సమానత్వము కోసం అవిశ్రాంతంగా పోరాడిన యోధుడుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశ చరిత్రలో మహోన్నత వ్యక్తిగా నిలిచారని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు.

ఘంటసాల మండలం జీలగలగండిలో అంబెద్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమంలో సురేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ బీఆర్ అంబెద్కర్ సంఘసంస్కర్తగా రాజకీయ న్యాయ,ఆర్థిక వేత్తగా దేశంలో అనేక సంస్కరణలకు నాంది పలికారని తెలిపారు. ప్రజలందరికీ న్యాయం,స్వేచ్ఛ, సమానత్వం,సౌభ్రాతృత్వాన్ని కల్పించి భారతదేశాన్ని ఆధునిక ప్రజాస్వామిక దేశంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం శ్రమించారన్నారు. అంబెద్కర్ జయంతిని కేవలం హంగామా చేయడానికి పరిమితం కాకుండా ఆయన సిద్ధాంతాలు,ఆశయాల అమలుకు కృషి చేయాలని, రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాపాడుకోవడం, సమాజంలో ఉన్న అసమానతలను ప్రశ్నించటం ప్రతి ఒక్కరూ ప్రాథమిక విధిగా భావించి ఆచరించడమే అంబేద్కర్కు ఇచ్చే ఘనమైన నివాళి అని సురేష్ బాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ముళ్ళపూడి పట్టాభి రామారావు,ఎంపీటీసీ సిద్ధినేని కుమార్ రాజా,ఆరే గౌతం,కమ్మగంటి బాలు, యశ్వంత్ జ్యోతి,మద్దాల లక్ష్మణ్,చందు,మెరుగు చందు అసోసియేషన్ నేతలు మేడేపల్లి సుబ్బారావు,మద్దాల వెంకటేశ్వరరావు,కుంభా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు గుంటూరు లాడ్జి సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితోనే కేంద్రంలో నరేంద్ర మోదీ మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి మహిళా సాధికారతకు పెద్దపీట వేసినట్లు తెలిపారు.

జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ ధారా అంబేద్కర్ మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో అంబేద్కర్ జీవితానికి సంబంధించిన ముఖ్య స్థలాలను ‘పంచ తీర్థ’గా అభివృద్ధి చేసి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసి, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఇతర పథకాల కోసం మళ్లించిందని ఆరోపించారు.

ఈ కార్యక్రమానికి డాక్టర్ ధారా అంబేద్కర్ అధ్యక్షత వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి నులక యేసు రత్నం, ప్రధాన కార్యదర్శులు రాయపూడి ఏసుబాబు, గట్టుపల్లి అబ్రహం, బజరంగ్ రామకృష్ణతో పాటు బీజేపీ నాయకులు కత్తి మేరీ సరోజిని, సురేష్ జెఎన్, అనుమోలు ఏడుకొండలు, నోముల చలపతిరావు, సురేష్ జైన్, హిమబిందు, రాధిక, బెహరా గాయత్రి, మహిళా న్యాయవాది స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారై ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా అంబేద్కర్ జయంతి





**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కాలేజీలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిన అంబేద్కర్‌కు ఈ సందర్భంగా కాలేజీ ప్రాంగణంలో విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్ బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అంబేద్కర్ సమానత్వం, న్యాయం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రిన్సిపాల్ డోలా సంజయ్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమాన హక్కులు కల్పించిందని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డా. శ్రీహరి ఆయన జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. సీతారామయ్య విద్య ద్వారానే సమాజంలో సమానత్వం సాధ్యమని, అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రతి విద్యార్థి అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చురుకుగా పాల్గొని అంబేద్కర్ ఆలోచనలను విస్తరించేందుకు ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలి

○ కేంద్రానికి ఏపీ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు విజ్ఞప్తి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలో మహిళల రాజకీయ సాధికారతకు కీలకంగా భావిస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఏపీ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు కోరారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ బిల్లులో వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు తగిన ప్రాతినిధ్యం లేకపోతే సామాజిక న్యాయం అసంపూర్ణంగానే మిగిలిపోతుందని ఆయన పేర్కొన్నారు.

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం స్వాగతించదగ్గ పరిణామమేనని, అయితే ఆ రిజర్వేషన్‌లో బీసీ మహిళలకు ప్రత్యేక భాగస్వామ్యం నిర్ధారించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రతిపాదనల్లో బీసీ మహిళలకు స్పష్టమైన హామీ లేకపోవడం వల్ల, సాధికారత లక్ష్యం పూర్తిగా సాధ్యం కాదని ఆందోళన వ్యక్తం చేశారు.

దేశ జనాభాలో గణనీయమైన శాతం ఉన్న బీసీ వర్గాలకు రాజకీయాల్లో తగిన అవకాశాలు కల్పించకపోతే, వారి సామాజిక-ఆర్థిక అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బీసీ మహిళలు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారికి రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా శక్తివంతమైన వేదిక కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఇప్పటికే రిజర్వేషన్లు ఉన్నట్లే, బీసీ మహిళలకు కూడా సబ్ కోటా ఏర్పాటు చేయడం ద్వారా సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు. ఇది కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాకుండా, సామాజిక సమతౌల్యానికి దోహదపడే కీలక చర్యగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, మహిళా రిజర్వేషన్ బిల్లులో తగిన సవరణలు చేసి బీసీ మహిళలకు ప్రత్యేక సబ్ కోటా కల్పించాలని పోలాకి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. అలాగే, ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరిపి అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

## బీజేపీ డిజిటల్ వ్యూహ శిక్షణ శిబిరం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ చేపట్టిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్‌లో భాగంగాగుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు మండలంలో పార్టీ కేడర్‌కు డిజిటల్ వ్యూహం, సోషల్ మీడియా వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పాలెం పుల్లారావు ఆధ్వర్యంలో అనంతవరప్పాడు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి వెల్పూరి రమేష్‌బాబు అధ్యక్షత వహించగా, బీజేపీ జిల్లా శిక్షణ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్ పర్యవేక్షణలో నిర్వహించారు.

ప్రధాన అతిథిగా హాజరైన బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు మాట్లాడుతూ, రాజకీయ పోటీ ఇప్పుడు సభలు, ర్యాలీలకే పరిమితం కాకుండా డిజిటల్ వేదికలకూ విస్తరించిందన్నారు. సోషల్ మీడియా వేదికలు కేవలం సమాచార మార్పిడి సాధనాలు మాత్రమే కాకుండా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనాలుగా మారాయని చెప్పారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించి పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేడర్‌కు సూచించారు.

అదే విధంగా ‘మైగవ్’, ‘సరళ్ యాప్’ వంటి అధికారిక డిజిటల్ వేదికల వినియోగం ద్వారా పార్టీ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు. కృత్రిమ మేధస్సు (ఊ×) వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పోస్టర్లు, వీడియోలు, ప్రచార సామగ్రి తయారీలో ఈ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతి బూత్‌కు కనీసం ఒక డిజిటల్ బృందం ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి కేడర్ సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలని, తప్పుడు ప్రచారాన్ని నిజమైన సమాచారంతో వెంటనే ఖండించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం, పార్టీ ప్రభావాన్ని విస్తరించడం ప్రతి కేడర్ బాధ్యతగా భావించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశు సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి సహా పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్





**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** నగరంలోని డాబా గార్డెన్స్‌లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

అనంతరం మీడియాతో మాధవ్ మాట్లాడుతూ సమాజ సమానత్వానికి ప్రాణం పోసిన మహనీయుడు అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గమే దేశానికి దిక్సూచి అని అన్నారు. సామాజిక న్యాయం, సమాన హక్కుల సాధనలో అంబేద్కర్ ఆలోచనలు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.

ప్రతి ఒక్కరూ అంబేద్కర్ సిద్ధాంతాలను ఆచరిస్తూ సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాల సాధనకే బీజేపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## స్పెషల్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి: ఆప్టా

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న పదో తరగతి మూల్యాంకన ప్రక్రియలో స్పెషల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లు, పీడీలకు న్యాయం చేయాలని ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) డిమాండ్ చేసింది. ప్రస్తుతం గతంతో పోలిస్తే పని భారం గణనీయంగా పెరిగిందని సంఘం పేర్కొంది. ప్రశ్నల వారీగా మార్కులను ట్యాబ్‌లలో ఆన్‌లైన్ ఎంట్రీ చేయాల్సిన అదనపు బాధ్యతలను కూడా అప్పగించినట్లు తెలిపింది.

అయితే ఈ పెరిగిన పనిభారం ఉన్నప్పటికీ, రోజుకు కేవలం రూ.300 మాత్రమే పారితోషికంగా చెల్లించడం అన్యాయమని ఆప్టా విమర్శించింది. అవసరాన్ని బట్టి దూర ప్రాంతాల నుండి కూడా ఉపాధ్యాయులను విధులకు కేటాయిస్తున్నారని, ఎనిమిది కిలోమీటర్లకు మించి ప్రయాణించే వారికి ట్రావెలింగ్ అలవెన్స్, కరువు భత్యం చెల్లించాలని కోరింది.

ఈ మేరకు ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహది పాఠశాల విద్యా కమిషనర్, ఆంధ్రప్రదేశ్ పరీక్షల విభాగం డైరెక్టర్‌కు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో రాజకీయ నేతలు ముందుకు సాగాలి: మంత్రి బీసీ జనార్దన్



**నంద్యాల (జర్నలిస్ట్ ఫైల్) :** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. బనగానపల్లె అవుకుమెట్ట దగ్గర అంబేద్కర్ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితోనే నేడు మనమంతా ప్రజాస్వామ్య విధానాలతో ముందుకు సాగుతున్నామని మంత్రి వెల్లడించారు. నేటితరం రాజకీయ నాయకులు ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.

నేడు అవుకుమెట్టలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా వేరే ప్రాంతానికి తరలించాల్సి ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఈ విగ్రహం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో సరైన స్థలాన్ని ఎంపిక చేసి అక్కడ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. స్థానిక నాయకులతో చర్చించి, చిరకాలం గుర్తుండేలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, అనువైన ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున దళిత సంఘాల నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## ఎన్జీవో హోంలో ఘనంగా డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సంస్మరణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** భారత రాజ్యాంగ శిల్పి డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా గుంటూరు ఎన్జీవో హోంలో సంస్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, డా. అంబేద్కర్ జీవితం సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన మహత్తర పోరాటానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ సమాజానికి సేవ చేయాలని సూచించారు. “విద్య పొందండి, సంఘటితమవండి, పోరాడండి” అనే అంబేద్కర్ మంత్రవాక్యాన్ని ప్రతి ఉద్యోగి ఆచరణలో పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆలోచనలు ప్రతి ఉద్యోగికి మార్గదర్శకంగా నిలవాలని అన్నారు. సమానత్వం, న్యాయం సాధన కోసం అంబేద్కర్ చూపిన దారిలో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్జీజీవో గుంటూరు సిటీ అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్. కళ్యాణ్ కుమార్, జీవీ కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీఎన్ సుకుమార్, సిహెచ్ అనిల్, బి. కృష్ణకిషోర్, కే. నరసింహారావు, సిటీ కార్యవర్గ సభ్యులు సునీల్ బావన్నారాయన, పాల్ ప్రసాద్, మహిళా విభాగం చైర్పర్సన్ షేక్ తాజునిసా, నాగ పావని, జైనభి, జసింత తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467